ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా రిపబ్లిక్ తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888



Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -84 పేజీలు - 8 వెల - 03/- సోమవారం 13 జులై 2026


## పవన్‌కల్యాణ్‌కు శస్త్ర చికిత్స.. పరామర్శించిన చంద్రబాబు



అమరావతిజూలై, 12, (రిపబ్లిక్ న్యూస్)ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను సీఎం చంద్రబాబు నాయుడు ముంబాయిలో పరామర్శించారు. భుజం నొప్పితో బాధపడుతున్న పవన్‌కల్యాణ్ శనివారం ముంబాయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ మిగతా2లో...

## విజయవాడలో ఏడు ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులు అగ్నికి ఆహుతి



హైదరాబాద్‌జూలై, 12, (రిపబ్లిక్ న్యూస్):నగరంలోని ఆటోనగర్‌లో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఏడు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. మరమ్మతుల కోసం మిగతా2లో...

## క్షిపణుల తయారీలో ప్రైవేట్ సంస్థలు

● కేంద్రంలోని మోడీ సర్కారు పన్నాగాలు ● తొలి దశలో అస్త్ర మార్క్-2 క్షిపణులు! ● ఉత్పత్తి లక్ష్యాల భారం పేరిట బీడీఎల్ నిర్వీర్యం ● రక్షణ ఉత్పత్తుల డిమాండ్ పెరగడంతో కొత్త వ్యూహమంటూ అడ్డదారి ● బరిలో ఐకామ్, అదానీ, ఫోర్జ్, టాటా, మహీంద్రా ● ముమ్మాటికీ దేశభద్రతకు ముప్పే : రక్షణశాఖ మాజీ సైన్యాధిపతులు




# కొత్త ఓటర్లకు మరో పరీక్ష

- తల్లిదండ్రుల సర్ వివరాలు కోరుతున్న ఈసీ ఆన్‌లైన్ పోర్టల్

నిబంధనలు మార్చకుండానే ఫారం -6లో కొత్త షరతులు

కేంద్ర అధికారిక నోటిఫికేషన్ లేకుండానే మార్పులు

రాష్ట్రాలను బట్టి ఫారాల్లో మార్పులు చేస్తున్నారని సందేహాలు

పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న మాజీ ఎన్నికల అధికారులు






## కన్నీటి వీడ్కోలు

మైసూరులో అధికారిక లాంఛనాలతో

జానకమ్మ అంత్యక్రియలు పూర్తి

అంతిమయాత్రలో భారీగా పాల్గొన్న అభిమానులు

మైసూరు,జూలై, 12, (రిపబ్లిక్ న్యూస్) గానకోకిల ఎస్. జానకి అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. కర్నా టక ప్రభుత్వం జానకమ్మ అంత్యక్రియలను మైసూరులో అధికారిక లాంఛనాలతో జరిపించింది. ఆమె అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు. జానకమ్మ కోరిక మేరకు కణియనహుండి ఫామ్‌హౌస్‌లో కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు జరిపించారు. అభిమాని ఫామ్ హౌస్ లో అంత్యక్రియలు హెచ్.డి. కోటే తాలూకాలోని కనియనహుండి గ్రామంలో ఉన్న ఒక వ్యవసాయ క్షేత్రంలో సాయంత్రం జానకి అంత్యక్రియలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ మిగతా2,8లో.

## బీఆర్ఎస్ దెబ్బతో సర్కార్ గోదారి బాట..

● కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పరుగులు పెట్టిస్తున్న కేటీఆర్

● నేడు దేవాదులకు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్

● నీటి విడుదలపై ప్రశ్నిస్తుండటంతో సర్కార్ ఉక్కిరిబిక్కిరి

వరంగల్,జూలై, 12, (రిపబ్లిక్ న్యూస్) బీఆర్ఎస్ దెబ్బతో కాంగ్రెస్ ప్ర భుత్వం దిగొచ్చింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 5న కన్నెపల్లిలో పర్యటించడం, గోదావరిలో నీళు ్లన్నప్పటికీ రేవంత్‌రెడ్డి సర్కార్ ఉద్దేశపూర్వకంగానే దిగువకు విడిచిపెడుతున్నదనే విషయాన్ని కుండ బద్ధలు కొట్టినట్టు వెల్లడించడంతో ప్రభుత్వ పెద్దలు ఎట్టకేలకు గోదారి బాట పట్టారు. కానీ, కన్నెపల్లికి వెళ్లి గోదావరిని పరిశీలిస్తే తమ సర్కార్ నవ్వుల పాలవుతుందన్న భయంతో సోమవారం దేవాదుల ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించనున్నారు. ఐదు నెలల క్రితం బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు దేవాదుల ప్రాజెక్టులో భాగమైన దేవన్నపేట పంప్‌హౌస్‌ను పరిశీలించినప్పుడు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇదేవిధం గా వ్యవహరించింది.



వరిరైతులను ఆదుకునేందుకు వెంటనే దేవాదుల పంపులను ఆన్ చేయాలని ఆ పర్యటన సందర్భంగా హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడంతో మరుసటి రోజు తెల్లారే మిగతా2లో...

## కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధణలో ప్రభుత్వం విఫలం: బిజెపి చీఫ్

హైదరాబాద్‌జూలై, 12, (రిపబ్లిక్ న్యూస్) కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన ఆదివారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ప్రభుత్వ చేతగానితనం వల్లే ఉత్తర తెలంగాణకు సాగు, తాగు నీరు అందడం మిగతా2లో...



## విశాఖకు జగన్..

గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించనున్న వైసీపీ అధినేత

ఈ నెల 14న విశాఖకు వెళ్లనున్న జగన్

బోటు ప్రమాదంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు పరామర్శ

ప్రభుత్వ వైఫల్యంపై తీవ్రస్థాయిలో మండిపడ్డ వైసీపీ నేతలు

సీఎం, డిప్యూటీ సీఎం మౌనంపై వైసీపీ విమర్శలు



అమరావతిజూలై, 12, (రిపబ్లిక్ న్యూస్)

వైసీపీ అధినేత జగన్ విశాఖపట్నంలో పర్యటించనున్నారు. ఇటీవల సముద్రంలో జరిగిన పడవ ప్రమాదంలో గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలను ఆయన పరామర్శించనున్నారు. ఈ నెల 14వ తేదీన జగన్ పర్యటన ఖరారైంది. ఈ పర్యటన వివరాలను వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆదివారం వెల్లడించారు. జూలై 14న ఉదయం 10:30 గంటలకు జగన్ విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారని, మిగతా2లో...

## పట్టిసీమకు నీళ్లు వదిలేందుకే మేడిగడ్డపై కుట్ర

● గురువు చంద్రబాబుకు రేవంత్ రెడ్డి గురుదక్షిణ ● ఇగో పక్కన పెట్టి తెలంగాణ రైతులను ఆదుకోండి ● ఎన్టీపీసీతో పాటు హైదరాబాద్‌కు తాగునీటి కష్టాలు తప్పవు : మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరిక



హైదరాబాద్,జూలై, 12, (రిపబ్లిక్ న్యూస్): పట్టిసీమకు నీళ్లు వదిలేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత రెండేండ్లుగా మేడిగడ్డకు మరమ్మత్తు చేయకుండా తాత్సారం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోటార్లు బంద్ పెట్టి, నీళ్లను కిందకు వదిలేస్తూ ఆంధ్రా ఆయకట్టుకు మేలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎల్‌నినో కరువు పరిస్థితుల్లో ప్రతి నీటి చుక్కా ముఖ్యమని నిపుణులు చెబుతున్న మాటలను సీఎం ఖాతరు చేయడం లేదన్నారు. ప్రస్తుతం గోదావరిలో పారుతున్న 50 వేల క్యూసెక్కుల వరదను కన్నెపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. దేవాదులలో 10 మోటార్లు ఉంటే 4 మాత్రమే నడుపుతూ.. 2,500 క్యూసెక్కులు ఎత్తాల్సిన చోట కేవలం 1,200 క్యూసెక్కులు మాత్రమే ఎత్తుతున్నారని ఆరోపించారు. ఫలితంగా వరంగల్, ధర్మసాగర్, పాలకుర్తిల్లో 75 శాతం చెరువులు ఎండిపోయాయని ఆందోళన మిగతా2లో...

## విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

- జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయానికి భూమిపూజ



# కొత్త ఓటర్లకు మరో పరీక్ష

**న్యూఢిల్లీ,జూలై, 12, (రిపబ్లిక్ న్యూస్)**కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే వారి కోసం ఉపయోగించే ఫారం-6లో ఎన్నికల సంఘం (ఈసీ) కొర్రీ పెట్టింది. ఎలాంటి చట్టపరమైన సవరణలు లేకుండా, నిబంధనలను మార్చకుండా కొత్త డిక్లరేషన్‌ను చేర్చింది. ఆ ఫారంలో దరఖాస్తుదారుడితో పాటు వారి తల్లిదండ్రుల పేర్లు, 2002 ఓటర్ల జాబితాలో వారి పేర్లు ఉన్నాయా లేదా అనే వివరాలు భర్తీ చేయాలని కోరుతున్నది. అయితే ఈ మార్పునకు అవసరమైన చట్టబద్ధ ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం అనుసరించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నా యి. దీనిపై ఓ ఆంగ్ల దినపత్రిక ప్రధాన కథనాన్ని ప్రచురించింది. ఫారం -6 ను 18 ఏండ్లు పూర్తి చేసుకున్న వారు, భారత పౌరసత్వం పొందిన వారు, గతంలో ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడిన వారు మళ్లీ నమోదు చేసుకోవడానికి ఉపయోగిస్తారు. అయితే కొత్త ఓటర్లను ఆదిలోనే కట్టడి చేసే ప్రక్రియలో భాగంగా కేంద్రం ఆ దరఖాస్తులో కొత్త సమాచారాన్ని కోరుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం తన 'ఈసీఐనెట్' ఆన్‌లైన్ పోర్టల్‌లో పారం-6 నింపే సమయంలో 'జె', 'కె' విభాగాల మధ్య కొత్త డిక్లరేషన్ భాగాన్ని చేర్చారు. ఇందులో దరఖాస్తుదారుడు.. 1.నా పేరు గత సర్ ఓటర్ల జాబితాలో ఉంది, 2. నా తండ్రి, తల్లి, తాత, అమ్మమ్మ పేరు గత సర్ జాబితాలో ఉంది. 3. నా పేరు గానీ, నా తల్లిదండ్రుల పేరు గాన్ గత సర్‌లో లేదు అంటూ ఈ మూడు ఎంపికల్లో ఒకదానిని తప్పనిసరిగా ఎంచుకోవాల్సి వస్తోంది. మొదటి రెండు ఎంపికల్లో ఏదైనా ఎంచుకుంటే.. సంబంధిత అసెంబ్లీ నియోజ



కవర్గం, పోలింగ్ బూత్ నంబర్, సీరియల్ నంబర్ వంటి వివరాలను కూడా నమోదు చేయాలని పోర్టల్ కోరుతోంది. అయితే, ఈ వివరాలు లేకపోతే మూడో ఎంపికను మాత్రమే ఎంచుకునే అవకాశం ఉంది. కానీ అలా ఎంపిక చేస్తే తర్వాత ఏమవుతుందనే విషయంపై పోర్టల్ ఎలాంటి వివరణ లేదు.ఆన్‌లైన్ ఫారం-6లో ఈ కొత్త డిక్లరేషన్ కనిపిస్తున్నప్పటికీ... అదే పోర్టల్‌లో డౌన్‌లోడ్ చేసుకునే ప్రింటెడ్ ఫారం-6లో మాత్రం ఈ కొత్త భాగం లేకపోవడం గమనార్హం. ఈ కొత్త నిబంధన బీహార్, అసోం మినహా సర్ పూర్తయిన, ప్రస్తుతం కొనసాగుతున్న ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలన్నింటిలో కనిపిస్తున్నది. ఈ మార్పులు సర్ ప్రక్రియతో అనుసంధానమై ఉన్నాయి. గతేడాది నుంచి దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో (యూటీలు) జరిగిన సర్‌లో 5.58 కోట్ల మంది పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించబడిన విషయం తెలిసిందే. ఇందులో ఒక్క పశ్చిమ బెంగాల్‌లో 27 లక్షలకుపైగా ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయి. దీంతో వారి పిల్లల ఓటరు నమోదుపై కూడా ఆ ప్రభావం కనిపిస్తుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్-28 ప్రకారం ఓటరు నమోదు నిబంధనల్లో మార్పులు చేయడానికి కేంద్ర ప్రభుత్వమే అధికారిక గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలి. ఈసీతో సంప్రదించిన తర్వాత కేంద్ర న్యాయశాఖ ఈ మార్పులను ప్రకటించాల్సి ఉంటుంది. ఫారం-6 కూడా ఎన్నికల నమోదు నిబంధనలు, 1960 (రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్) కింద ఉన్న చట్టబద్ధ ఫారం.అందువల్ల అందులో మార్పులు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని ఎన్నికల సంఘం మాజీ అధికారులు చెబుతున్నారు. "చట్టంలో, నిబంధనల్లో సవరణ లేకుండా ఎన్నికల సంఘం స్వయంగా ఫారం-6లో మార్పులు చేయడానికి అధికారం లేదు. ఫారంలో ఎక్కడైనా ఒక కామా (,) కూడా ఈసీ తనంతట తాను జోడించలేదు" అని ఇద్దరు మాజీ సీనియర్ ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. దీనికి ఉదాహరణగా 2021లో ఆధార్ సంఖ్యను ఓటరు నమోదులో చేర్చేందుకు పార్లమెంట్ చట్ట సవరణ చేసిన తర్వాత, 2022 జూన్‌లో కేంద్ర న్యాయశాఖ అధికారిక నోటిఫికేషన్ ద్వారా ఫారం-6లో మార్పులు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తున్నారు.అయితే ప్రస్తుత మార్పులపై ఎన్నికల సంఘం నుంచి స్పందన రావాల్సి ఉంది. దీనిపై స్పందించేందుకు కేంద్ర న్యాయశాఖ కార్యదర్శి అందుబాటులోకి రాలేదు. ఈ పరిణామం నేపథ్యంలో చట్టబద్ధ సవరణలు లేకుండానే ఆన్‌లైన్ ఫారం-6లో కొత్త వివరాలు కోరడం రాజ్యాంగం, పరిపాలనా పరంగా సమంజసమేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## బీఆర్ఎస్ దెబ్బతో సర్కార్ గోదారి బాట..

(మొదటి పేజీ తరువాయి)

(ఫిబ్రవరి 22న) సీఎం రేవంత్‌రెడ్డి ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని దేవాదులలో పర్యటించారు. నిలదీస్తే కానీ కదలరా?రైతుల కష్టాలను దూరం చేయాలని బీఆర్ఎస్ అడిగితే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం కదిలే పరిస్థితి లేదని జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. గోదావరి నీటి వినియోగ అంశమే ఇందుకు ఇందుకు తాజా నిదర్శనం. ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది తీవ్ర ప్రతికూల పరిస్థితులు ఏర్పడటంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 5న జయశంకర్-భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధాన భాగమైన కన్నెపల్లి పంప్‌హస్ వద్ద గోదావరి నీటి లభ్యతను పరిశీలించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ రైతు వ్యతిరేక వైఖరిని కేటీఆర్ తూర్పారబట్టారు. దీంతో ఉక్కిరి బిక్కిరైన రేవంత్‌రెడ్డి.. స్వయంగా మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి, గోదావరిలో నీళ్లు ఉన్నాయని అనివార్యంగా ఒప్పుకోవాల్సి వచ్చింది. కానీ, మేడిగడ్డ బరాజ్ కుంగుబాటును సాకుగా చూపుతూ నీళ్లు ఎత్తిపోయబోమని తేల్చిచెప్పారు. దీంతో కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయాలని కాళేశ్వరం పరీవాహక ప్రాంతంలోని రైతులతోపాటు రిటైర్డు ఇంజినీర్లు, తెలంగాణ మేధోసమాజం నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి అధికమైంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ పెద్దలు గోదావరిని పరిశీలించేందుకు దేవాదులకు పయనమవుతున్నారు.**నాడు హరీశ్.. నేడు కేటీఆర్** రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి బీఆర్ఎస్ అడుగడుగునా ముచ్చెమటలు పట్టిస్తున్నది. గోదావరిలో నీరున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే రైతులకు సాగునీటి కష్టాలు తెచ్చిపెడుతున్నదని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఫిబ్రవరి 21న దేవన్నపేట పంప్‌హౌస్‌ను పరిశీలించి దుయ్యబట్టడంతో ఆ మరుసటి రోజే సీఎం రేవంత్‌రెడ్డి గోదావరి తీరంలోని దేవాదుల ప్రాజెక్టు పనితీరుపై సమీక్ష నిర్వహించాల్సి వచ్చింది. ఇదేవిధంగా కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద దాదాపు 1 లక్ష క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్నదని, అయినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి తన గురువు కండ్లల్లో ఆనందం కోసమే గోదావరి నీటిని దిగువకు వదిలిపెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 5న ధ్వజమెత్తారు. ఆ నీటిని ఎత్తిపోయకుంటే వేలాదిగా తరలివచ్చి కన్నెపల్లి పంపులను ఆన్ చేస్తామని అల్టిమేటం జారీచేయడంతో కాంగ్రెస్ సర్కార్ నష్టనివారణ చర్యలకు ఉపక్రమించింది. దీనిలో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి గోదావరి నీటిపారుదల, వరద ప్రవాహం, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు, కన్నెపల్లి పంప్‌హౌస్ తదితర అంశాలపై నోరు విప్పారు. ఈ నేపథ్యంలో తక్షణ ఉపశమన చర్యగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీతక్క తదితరులు సోమవారం దేవాదుల వద్ద గోదావరి నీటి ప్రవాహాన్ని పరిశీలించనున్నారు.

## విశాఖకు జగన్..

(మొదటి పేజీ తరువాయి)

అక్కడి నుంచి నేరుగా దక్షిణ నియోజకవర్గంలోని జబ్బరుపేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను ఓదార్చుతారని తెలిపారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన కరి చిన్నాతో పాటు అతని కుటుంబ సభ్యులతోనూ జగన్ మాట్లాడతారని చెప్పారు.ఈ సందర్భంగా కేకే రాజు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తీరానికి కేవలం 8 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదం జరిగినా, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరడానికి 20 గంటల సమయం పట్టిందని ఆరోపించారు. కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీసు, మత్స్య, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారని అన్నారు.
గల్లంతైన వారి ఆచూకీ లభించకముందే రెస్క్యూ ఆపరేషన్‌ను నిలిపివేయడాన్ని ఆయన తప్పుబట్టారు. జిల్లాకు చెందిన హోం మంత్రి అనిత బాధితులను పరామర్శించకపోవడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు ఈ విషాదంపై మౌనంగా ఉన్నారంటూ విమర్శించారు.
జూలై 4న గంగవరం తీరానికి 10 నాటికల్ మైళ్ల దూరంలో ఏడుగురు మత్స్యకారులతో వెళ్లిన మర పడవ బోల్తా పడిన విషయం తెలిసిందే. వీరిలో ఒకరు ప్రాణాలతో బయటపడగా, ఆరుగురి ఆచూకీ లభించలేదు. నాలుగు రోజుల పాటు నేవీ, కోస్ట్ గార్డ్ గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో ఆపరేషన్‌ను నిలిపివేశారు. రాష్ట్ర ప్రభుత్వం గల్లంతైన వారి కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది.

# పట్టిసీమకు నీళ్లు వదిలేందుకే మేడిగడ్డపై కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు.మొన్నటి వరకు గోదావరిలో నీళ్లే లేవని అబద్ధం చెప్పిన సీఎం... పారుతున్న గోదావరిని లైవ్ లో చూపించగానే మాటమార్చి కొత్త పల్లవి ఎత్తుకున్నారని ఎద్దేవా చేశారు. మేడిగడ్డ గేట్లు మూయకుండా కన్నెపల్లి మోటార్లు ఎలా నడుపుతారంటూ అవగాహన లేకుండా మాట్లాడుతున్నా రని దుయ్యబట్టారు. 2028లో 28 లక్ష?లు, 2025లో 15లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా భద్రాచలానికి ఎలాంటి ముప్పు జరగలేదని గుర్తు చేశారు. అన్నారం, సుందిళ్ల రెండు బ్యారేజీల్లో మొత్తం 8 టీఎంసీలంటే దాదాపు 80 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే నిల్వ ఉంటుందని చెప్పారు. ఇదే విషయాన్ని తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్లు చెబితే సీఎం జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. నిన్నటి దాకా నిపుణుల కమిటీ, రిటైర్డ్ ఇంజనీర్లు అని చెప్పిన సీఎం.. ఇప్పుడు నీళ్లు ఎత్తమని టెక్నికల్ సూచన చేయగానే వారిని జైల్లో పెడతామని బెదిరిస్తున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏనాడూ రిటైర్డ్ ఇంజనీర్లు మేడిగడ్డ సాధ్యం కాదని చెప్పలేదని గుర్తు చేశారు. మిడ్ మానేరుకు నేరుగా నీళ్లు తీసుకెళ్లడం కష్టం కాబట్టి, వరస బ్యారేజీలు కట్టి ఎల్లంపల్లి ద్వారా తీసుకెళ్లమని జస్టిస్ ఘోష్ కమిషన్‌కు అఫిడవిట్ ఇచ్చారని పేర్కొన్నారు. ఇరిగేషన్ శాఖకు చెందిన అధికారులు రూ. 8.5 కోట్ల ఖర్చుతో కాపర్ డ్యాం కట్టడం ద్వారా నీళ్లు ఎల్లంపల్లికి తీసుకువెళ్లొచ్చంటూ ప్రభుత్వానికి లేఖ రాశారని తెలిపారు. దాన్ని వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.మేడిగడ్డపై రిపోర్ట్ ఇచ్చిన ఎన్డీఎస్ఏ చైర్మెన్ చంద్రశేఖర్ అయ్యర్, అతుల్ జైన్‌ల హయాంలోనే పోలవరం కాపర్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్ ఆరు సార్లు కొట్టుకుపోవడం వల్ల రూ.7 వేల కోట్లకు పైగా నష్టం జరిగిందన్నారు. అలాంటి వారికి ప్రమోషన్లు ఇచ్చి ఇక్కడకు పంపితే మేడిగడ్డ 3 పిల్లర్ల కుంగుబాటుపై రిపోర్టులు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. హిట్లర్ తనకు ఆదర్శం అన్న రేవంత్ రెడ్డి, అదే హిట్లర్ తరహాలో హంతక భాష మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇగోలకు, పంతాలకు పోయి రైతుల పంటలను ఎండబెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. తక్షణమే కన్నెపల్లి, దేవాదుల మోటార్లను పూర్తిస్థాయిలో ఆన్ చేసి రాష్ట్రాన్ని కరువు బారి నుంచి కాపాడలని సూచించారు. లేదంటే ఎన్టీపీసీ, సింగరేణితో పాటు హైదరాబాద్‌కు తాగునీటికి కష్టాలు తప్పవన్నారు. అదే జరిగితే ఎండిన ప్రతి పంటకు, రాలిన ప్రతి రైతు కన్నీటి బొట్టుకు తెలంగాణ సమాజం సీఎంను దోషిగా నిలబెడుతుందని హెచ్చరించారు.

## పవన్‌కల్యాణ్‌కు శస్త్ర చికిత్స.. పరామర్శించిన చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

అంబానీ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు.ఏపీ సీఎంతో పాటు మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్ తదితరులు పరామర్శించారు.అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ గత కొంతకాలంగా కుడి భుజం నొప్పితో బాధపడుతున్న పవన్‌కల్యాణ్ వైద్య నిపుణుల సూచనల మేరకు చేయించుకున్న ఆపరేషన్ విజయవంతమైందన్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రెండువారాల విశ్రాంతి అనంతరం పవన్‌కల్యాణ్ విధుల్లో పాల్గొంటారని వివరించారు. ఎడమ భుజానికి కూడా ఆపరేషన్ అవసరమా? కాదా? అని వైద్యుల సూచన మేరకు జరుగుతుందన్నారు.

## విజయవాడలో ఏడు ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులు అగ్నికి ఆహుతి

(మొదటి పేజీ తరువాయి)

మెకానిక్ షెడ్‌లో నిలిపి ఉంచిన బస్సులకు మంటలు అంటుకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే, ఆటోనగర్‌లోని ఓ మెకానిక్ షెడ్‌లో మరమ్మతుల కోసం ఒక బస్సును నిలిపారు. ఆ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే పక్కన పార్క్ చేసి ఉన్న మిగతా ఆరు బస్సులకు కూడా మంటలు వేగంగా వ్యాపించాయి. పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగిసిపడటాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే మూడు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగకపోవడంతో అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఏడు బస్సులు పూర్తిగా దగ్ధమవడంతో భారీ ఆస్తి నష్టం వాటిల్లింది.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

## క్షిపణుల తయారీలో ప్రైవేట్ సంస్థలు

**న్యూఢిల్లీ,జూలై, 12, (రిపబ్లిక్ న్యూస్):** కేంద్రంలోని మోదీ సర్కార్ భారత రక్షణ ఉత్పత్తుల విధానంలో కీలక మార్పులు చేయబోతున్నది! క్షిపణుల తయారీ ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన 'అస్త్రా మార్క్-2' క్షిపణి తయారీ కోసం ప్రైవేట్ సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించే అవకాశముందని, దీనికి ఇండోనేషియా ఆసక్తి కనబర్చినట్టు జాతీయ మీడియాలో వార్తా కథనాలు వెలువడ్డాయి.ఐకామ్, అదానీ, భారత్ ఫోర్జ్, టాటా గ్రూప్, మహీంద్రా గ్రూప్ నుంచి బిడ్లు దాఖలయ్యే అవకాశముందని తెలిసింది. యుద్ధ విమానాలు, డ్రోన్లు, ఫిరంగి, నౌకాదళ ప్లాట్‌ఫామ్ వంటి రంగాల్లో భారత్ ఇప్పటికే ప్రైవేట్ భాగస్వామ్యాన్ని అనుమతించింది. క్షిపణుల రంగాన్ని కూడా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించటం ద్వారా, అస్త్రా మార్క్-2 మొదటి ప్రైవేట్ తయారీ క్షిపణి అవుతుందని వార్తా కథనాలు వెలువడ్డాయి.

## కన్నీటి వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశాల మేరకు పూర్తి అధికారిక లాంఛనాలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. జానకి కుమారుడు మురళీకృష్ణ ఈ ఏడాది జనవరిలోనే మరణించడంతో ఆమె మనవరాలు అప్సర దహన సంస్కార కార్యక్రమాలు నిర్వహించారు. కనియనహుండి గ్రామంలోని జానకి అభిమాని నవీన్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ఈ అంత్యక్రియలు జరిగాయి.**భావోద్వేగానికి గురైన అభిమానులు** ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మహారాజా కాలేజ్ మైదానంలో సినీ ప్రముఖులు, సంగీత దర్శకులు, కళాకారులు, వేలాది మంది అభిమానులు ఆమెకు కన్నీటి వీడ్కోలు పలుకుతూ నివాళులర్పించారు. అంతిమ సంస్కారాల కోసం ఆమె భౌతికకాయాన్ని హెచ్.డి. కోటె తాలూకాలోని కనియనహుండి తోటలోకి తరలించారు. అక్కడ కాసేపు అభిమానుల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఉంచారు. మధ్యాహ్నం 3:05 గంటలకు అంతిమ యాత్ర ప్రారంభమైంది. ఆమె కుటుంబ సభ్యులు, పోలీసులు, అధికారులు వాహనాల్లో వెంట వెళ్లారు. తమ అభిమాన గాయనికి చివరిసారిగా అభిమానులు దారి పొడవునా నీరాజనం పట్టారు. పోలీసులు భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు.

## కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధణలో ప్రభుత్వం విఫలం: బిజెపి చీఫ్

(మొదటి పేజీ తరువాయి)

లేదని ఆయన మండిపడ్డారు. ఎన్‌డిఎస్‌ఏ నివేదికలను పట్టించుకోకుండా మూడు వర్కింగ్ సీజన్లను వృథా చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంపై నెపం నెట్టి తన బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీల పునరుద్ధరణ పనులు ఆలస్యం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి నుంచి 200 టిఎంసిల నీటిని వనియోగించుకునే అవకాశం కోల్పోయిందని ఆయన విమర్శించారు. ఎన్‌డిఎస్‌ఏ సమగ్ర పరిశీలన చేసి, సాంకేతికతను పరిశీలించి, పునరుద్ధరణకు తగు చర్యలు చేపట్టాల్సిందిగా చేసిన సూచనలను పెడచెవిన పెట్టారని ఆయన విమర్శించారు. ముందే పునరుద్ధరణ పనులు చేపట్టి ఉంటే ఉత్తర తెలంగాణలో సుమారు ఇరవై నుంచి ఇరవై ఐదు లక్షల ఎకరాలకు నీరు అందేదని, హైదరాబాద్‌కూ తాగు నీటి సమస్య ఉండేది కాదని ఆయన తెలిపారు.విజిలెన్స్ నివేదికను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పినాకిని చంద్ర ఘోష్ కమిషన్ ముందు రాష్ట్ర ప్రభుత్వం తన వాదనను సక్రమంగా వినిపించడంలో విఫలమైందని ఆయన తూర్పారపట్టారు. పంప్ హౌస్‌లు, టన్నెల్లు, రిజర్వాయర్లతో సహా మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. రూ. 1.30 లక్షల కోట్ల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరంపై సమగ్ర విచారణ జరిపించేందుకు ఎందుకు వెనుకాడుతున్నారని రాంచందర్ రావు తన లేఖలో ప్రశ్నించారు.

## విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**జగిత్యాల, జూలై, 12, (రిపబ్లిక్ న్యూస్):** విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రం సమీపంలోని చలగల్ వాలంతరీ వ్యవసాయ క్షేత్రంలో కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణానికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మంత్రి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో కేంద్రీయ విద్యాలయం కోసం వాలంతరీ వ్యవసాయ క్షేత్రంలోని ఐదు ఎకరాల విలువైన భూమిని కేటాయించినట్టు తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, జగిత్యాల అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంలో అండగా ఉంటామని అన్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ.. కేంద్రీయ విద్యాలయాలు నాణ్యమైన విద్యకు చిరునామాగా నిలుస్తున్నాయని చెప్పారు. జగిత్యాలకు కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయడం జిల్లాకు గొప్ప అవకాశమని, త్వరలో తాత్కాలిక భవనంలో తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ?ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాకు కేంద్రీయ విద్యాలయం రావడం గర్వకారణమని, విద్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని అన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన బోయకొండ



**చౌడేపల్లి ప్రతినిధి జూలై 12 రిపబ్లిక్ న్యూస్**

శక్తి క్షేత్రం బోయకొండపై అనూహ్యంగా భక్తుల రద్దీ పెరిగింది ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కొండ దినాన్ని పురస్కరించుకొని ఆలయంలోని అర్చకులు వేద పండితులు అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూ లైన్ లన్నీ భక్తులతో నిండిపోయాయి ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై చిన్నారెడ్డప్ప గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు క్యూ లైన్లు పెద్ద భోగం చిన్న భోగం తదితర ప్రాంతాలలో ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం పర్యవేక్షించారు. సౌకర్యాలను భక్తులను అడిగి తెలుసుకున్నారు కాగా కొండ కింద నుంచి పై వరకు వాహనాలు ఎక్కడపడితే అక్కడ ఆగిపోవడంతో ట్రాఫిక్కు అంతరాయం కలిగింది.

# గంగమ్మ ఆలయాలకు మంత్రి పెద్దిరెడ్డి విరాళాలు



**చౌడేపల్లి ప్రతినిధి జూలై 12 రిపబ్లిక్ న్యూస్**

మండలంలోని రెండు గంగమ్మ ఆలయాలకు మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విరాళాలు అందించారు ఏ కొత్తకోట పంచాయతీ అంకుతోటపల్లి పెద్దయ్యలకుంట్ల పంచాయతీ చెడుగుట్లపల్లి గ్రామాలలో గల గంగమ్మల ఆలయాలకు రూ 20 వేలు చొప్పున అందించారు. నగదును మండల వైసీపీ అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు జంగాలపల్లి వెంకటరమణ, సర్పంచుల సంఘ మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి ,షంషీర్, ఆయా పంచాయతీలకు చెందిన మాజీ సర్పంచులు నాయకుల ఆధ్వర్యంలో వారు నగదును అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు

# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి




**చౌడేపల్లి ప్రతినిధి జూలై 12 రిపబ్లిక్ న్యూస్**

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని పుంగునూరు రూరల్ సీఐ సాయిప్రసాద్ అన్నారు.మంగళవారం స్థానిక బస్టాండ్ లో ఆయన పలు వాహనాలను తనిఖీ చేశారు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు అదేవిధంగా కార్లు వంటి వాహనాలను నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు వీటితో పాటు సెల్ఫోన్ డ్రైవింగ్ వద్దన్నారు తిరుపతి పలమనేరు పుంగనూరు వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా లేని వారిపై జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గంగాపురం వద్ద రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



**చౌడేపల్లి ప్రతినిధి జూలై 12 రిపబ్లిక్ న్యూస్**

బోయకొండ క్షేత్రం గంగాపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలికకు గాయాలైన సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది బోయకొండ గంగాపురంలో ఎదురుగా వెళ్తున్న కారును మరో కారు వెనకనే వచ్చి ఢీకొన్నది ఈ ప్రమాదంలో మదనపల్లికి చెందిన వర్ష (15)కు గాయాలయ్యాయి గాయపడ్డ బాలికను స్థానికులు 108 సేవల ద్వారా మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు

# గుమ్మనూరు గ్రామంలో వర్షాలు కురవాలని గంగాభిషేకం







**చిప్పగిరి, జూలై, 12, (రిపబ్లిక్ న్యూస్)**

చిప్పగిరి మండలం గుమ్మనూరు గ్రామంలో వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని గ్రామ ఆచార సంప్రదాయం మేరకు గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో గ్రామ బొడ్డురాయికి 101 నీటి బిందెలతో గంగాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలూరు నియోజకవర్గ బీజేపీ బీఎల్ఓ-1 గుమ్మనూరు నారాయణ, ఆయన కుమారుడు గుమ్మనూరు చైతన్య గ్రామ పెద్దలు, యువతతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. వేదమంత్రాలు, భక్తిగీతాల నడుమ గ్రామ బొడ్డురాయికి గంగాభిషేకం నిర్వహించి, గ్రామంలోని ప్రతి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వర్షదేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, చెరువులు, కుంటలు నిండాలని, రైతులకు పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామంలో సుఖశాంతులు, సుభిక్షం నెలకొనాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.అనంతరం గ్రామ పెద్దలు మాట్లాడుతూ, పూర్వీకుల కాలం నుంచి వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తూ గ్రామ సంక్షేమం కోసం ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తుంటామని తెలిపారు. గ్రామ ప్రజలంతా ఐక్యంగా పాల్గొని భక్తిశ్రద్ధలతో గంగాభిషేకాన్ని నిర్వహించడం విశేషమన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, రైతులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలో త్వరలో మంచి వర్షాలు కురిసి రైతాంగం ఆనందంగా ఉండాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

# రజకుల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

## ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక సంఘం డిమాండ్ - ఘనంగా 'రజక ఆకాంక్ష సభ'








**అనంతపురం/గుత్తి, జూలై 12:( రిపబ్లిక్ న్యూస్)**

రజకుల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. రజకుల సంక్షేమం కేవలం హామీలకే పరిమితం కాకుండా ఆర్థిక సాధికారత దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఇదే సందర్భంగా రజక సంఘాల ప్రతినిధులు తమ ప్రధాన డిమాండ్‌ను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫార్సు చేసి న్యాయం చేయాలని కోరారు.

గుత్తి పట్టణంలోని విరుపాక్షి రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన రజక ఆకాంక్ష సభకు ఎమ్మెల్యే గల్లా మాధవి, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రజక సంఘాల నాయకులు, ఘన స్వాగతం పలికారు. అనంతరం రజకుల సంక్షేమం, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సామాజిక సాధికారత, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

**'రజకుల అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుంది'**

ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ రజకుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పన ద్వారా యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రజకుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**'సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోండి'**

ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో రజకుల సేవలు ప్రశంసనీయమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హ కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రజక వర్గం ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు అందరూ సహకరించాలని కోరారు.

**'వెనుకబడిన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం'**

రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రజకుల ఆర్థిక సాధికారతకు తోడ్పడే కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**'ఆకాంక్ష సభలతో అవగాహన పెరుగుతుంది'**

రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి మాట్లాడుతూ రజకులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడమే ఆకాంక్ష సభల ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రజక సమాజం సంఘటితంగా ఉంటేనే మరింత అభివృద్ధి సాధించగలదన్నారు.

**ఎస్సీ హోదా కల్పించాలని వినతి**

సభలో రజక సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని రజకుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వారిని ఎస్సీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసి న్యాయం చేయాలని ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. తమ న్యాయమైన డిమాండ్ నెరవేరే వరకు ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**ఐక్యతతోనే మరింత పురోగతి**

గుమ్మనూరు నారాయణస్వామి మాట్లాడుతూ రజక సమాజం ఐక్యంగా ముందుకు సాగితేనే మరిన్ని అవకాశాలు, హక్కులు సాధించవచ్చన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని యువత అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కేసి హరి పత్తి హిమబిందు టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రతాప్ రాష్ట్ర డైరెక్టర్ రామాంజనేయులు సంఘం జిల్లా అధ్యక్షుడు దేవేంద్రప్ప కిరణ్ శ్రీనివాసులు సురేష్ శీనా నాగేంద్రుడు మల్లికార్జున రజక సంఘాల రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బలిజకాపుల సంక్షేమమే ముఖ్యం

## పల్లాతో అరిగెల మనోహర్ భేటీ

**విశాఖపట్నం ప్రతినిధి, జూలై 12 (రిపబ్లిక్ న్యూస్):**

బలిజ, కాపు సామాజిక వర్గాల అభ్యున్నతి, సంక్షేమమే తన ప్రధాన ధ్యేయమని రాష్ట్ర బలిజ కాపు నాయకుడు, "మన" అసోసియేషన్ అధ్యక్షుడు అరిగెల మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం విశాఖపట్నంలోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పలు కీలక అంశాలపై చర్చించారు.

**ఉపాధి అవకాశాలు పెరిగేలా పథకాలు అమలు చేయాలి**

ఈ సందర్భంగా బలిజ, కాపు వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అరిగెల మనోహర్ వివరించారు. అలాగే విద్యార్థులకు ఉన్నత విద్యలో ప్రోత్సాహకాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, సంక్షేమ పథకాల అమలులో ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



**కాపు వర్గాల సంక్షేమం కోసం సమిష్టి కృషి**

ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు స్పందిస్తూ ప్రజల సంక్షేమం, సామాజిక వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అర్హులందరికీ చేరేలా చర్యలు కొనసాగు తున్నాయని, బలిజ, కాపు వర్గాల అభివృద్ధికి వచ్చిన వినతులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. భేటీ అనంతరం అరిగెల మనోహర్ మాట్లాడుతూ బలిజ, కాపు వర్గాల సంక్షేమం కోసం అన్ని స్థాయిల్లో సమిష్టిగా కృషి కొనసాగిస్తామని,ప్రజలతో కలిసి ముందుకు సాగుతామని అన్నారు.

# ఆంధ్రజ్యోతి విలేకరి నాగేష్‌కు నివాళి

## ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి



**అనంతపురం / శింగనమల క్రైమ్, జూలై 12,(రిపబ్లిక్ న్యూస్):** మండల కేంద్రంలో పనిచేసిన ఆంధ్రజ్యోతి విలేకరి బి. నాగేష్ ఆకస్మిక మృతి తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. ఆదివారం శింగనమలలోని నాగేష్ నివాసానికి వెళ్లిన ఆయన, పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

**ప్రజా ఉద్యమాలకు అందించిన సేవలు చిరస్మరణీయం**

ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ నాగేష్ పాత్రికేయుడిగా ప్రజా సమస్యలను నిష్పాక్షికంగా వెలుగులోకి తీసుకువచ్చి ప్రజా ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. సామాజిక సమస్యలు, ప్రజా ఉద్యమాలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రజల గొంతుకగా నిలిచిన పాత్రికేయుడిని కోల్పోవడం మీడియా రంగానికే కాక సమాజానికీ తీరని లోటని పేర్కొన్నారు.నాగేష్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, పాత్రికేయ మిత్రులు అండగా నిలిచి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని సాకే హరి విజ్ఞప్తి చేశారు. అనంతరం నాగేష్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

# పులివెందులలో అనంత అమ్మాయిల సత్తా

## జూనియర్ షూటింగ్ బాల్ టైటిల్ కైవసం



**అనంతపురం స్పోర్ట్స్, జూలై 12,(రిపబ్లిక్ న్యూస్):** పులివెందులలో నిర్వహించిన 9వ జూనియర్ షూటింగ్ బాల్ టోర్నమెంట్‌లో అనంతపురం జిల్లా బాలికల జట్టు అద్భుత ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచింది. జట్టు ఫైనల్లో విజయం సాధించి టైటిల్ ను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రత్యర్థి జట్లను అధిగమించిన అనంతపురం క్రీడాకారిణులు జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో చాటారు. ఈ విజయంపై ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పరుశరాముడు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం విజేత జట్టును ప్రత్యేకంగా అభినందించారు. అలాగే అనంతపురం జిల్లా కార్యదర్శి అమరేంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగరాజు, క్రీడా ప్రతినిధులు జ్యోతి, తేజస్విని, ధను తదితరులు క్రీడాకారిణులను అభినందించి, భవిష్యత్తులో జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్రీడాకారిణుల కృషి, కోచ్‌ల శిక్షణ, తల్లిదండ్రుల సహకారమే ఈ విజయానికి కారణమని వారు పేర్కొన్నారు.

# గురుకులంలో మౌలిక వసతులు కల్పించాలి

## 63వ జాతీయ రహదారిపై విద్యార్థుల తల్లిదండ్రుల బైఠాయింపు



**అనంతపురం/గుత్తి, జూలై 12 : (రిపబ్లిక్ న్యూస్)** గుత్తి మండలం రాజాపురం గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆదివారం ఆందోళనకు దిగారు. 63వ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తూ 'ప్రిన్సిపల్ డౌన్.. డౌన్' అంటూ నినాదాలు చేశారు. దీంతో కొంతసేపు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో తాగునీరు, పారిశుద్ధ్యం, వసతి తదితర కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. అపరిశుభ్ర వాతావరణం కారణంగా విద్యార్థులు తరచూ జ్వరాలు, ఇతర ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు.

విద్యార్థుల ఆరోగ్యంతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, వెంటనే పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ధర్మాన్ని మనం రక్షిస్తే ఆ ధర్మమే కాపాడుతుంది





**మహానంది, జూలై 12, (రిపబ్లిక్ న్యూస్)**ధర్మాన్ని మనం రక్షిస్తే ఆ ధర్మమే మనల్ని రక్షిస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసకులు, పద్మశ్రీ డాక్టర్ యల్లా వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి మహానందికి వచ్చిన ఆయన మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని చెప్పారు. దేవాలయాలను అభివృద్ధి చేయడంతో పాటు కళాకారులు, అర్చకులను ప్రోత్సహించాలన్నారు. కళాకారులు సౌభాగ్యంగా ఉంటే రాష్ట్రం సౌభాగ్యంగా ఉంటుందన్నారు. సంగీతం, సాహిత్యంపై యువకులకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

# దగ్గుపాటిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోం

## మాజీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు యల్లనూరు రియాజుద్దీన్ -షకీల్ షఫీని ముతవల్లి పదవి నుంచి తొలగించాలి



**అనంతపురం రామ్ నగర్, జూలై 12,( రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి పై షకీల్ షఫీ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైనది కాదని, వాటిని మేము సహించబోమని టీడీపీ మాజీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు యల్లనూరు రియాజుద్దీన్, 12వ డివిజన్ కో-కన్వీనర్ కరిముల్లా, జెమిని ఇసాక్, సలాముల్లా తదితరులు హెచ్చరించారు. ఈ సందర్భంగా షకీల్ షఫీని ముతవల్లిల పదవి నుంచి వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రామ్ నగర్ లో ఉన్న క్యాన్ పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు.

**పబ్బం గడిపే రాజకీయ కుట్రలు చేస్తూ కాలక్షేపం**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షకీల్ షఫీ తాను టీడీపీ నాయకుడినని చెబుతున్నప్పటికీ గతంలో పార్టీకి రాజీనామా చేశారని, అయినప్పటికీ పార్టీ పేరును వినియోగించుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆయన కూటమికి వ్యతిరేకంగా, వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వ్యక్తికి మూతవల్లి వంటి బాధ్యతాయుతమైన పదవిలో కొనసాగే అర్హత లేదని అభిప్రాయపడ్డారు. జిల్లాలో కొందరు టీడీపీ నాయకులు షకీల్ షఫీకి మద్దతు ఇస్తున్నారని అయితే పార్టీ అధిష్ఠానం కూడా దీనిపై దృష్టి సారించాలని కోరారు. ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యతను విస్మరించి వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తున్నారని, ముస్లిం అభివృద్ధి సంక్షేమంపై దృష్టి పెట్టాల్సిన ఉండగా.. పబ్బం గడిపే రాజకీయ కుట్రలు చేస్తూ కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. ఈద్గాలు, మసీదుల్లో మౌలిక సదుపాయాలు అనేక చోట్ల లేక ఇబ్బందులు పడుతున్నారని, వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, అభివృద్ధి, ఆదాయ వినియోగంపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేద ముస్లిం విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు ఏమిటో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై మాట్లాడకుండా రాజకీయ విమర్శలకే పరిమితం కావడం సరికాదని అభిప్రాయపడ్డారు.

**ముస్లింల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచన**

మూతవల్లి ఎన్నికలు నిబంధనల ప్రకారం మూడు సంవత్సరాలకు ఒకసారి జరగాలని, ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. పదవులు ప్రజాసేవ కోసం ఉండాలే గానీ వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదన్నారు. తమ ఎమ్మెల్యే దగ్గుపాటిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ప్రజలు ఇప్పటికే పలుమార్లు తిరస్కరించినప్పటికీ షకీల్ షఫీ తన తీరు మార్చుకోలేదని విమర్శించారు. ముస్లిం సమాజం అభివృద్ధికి కృషి చేయకుండా రాజకీయ కుట్ర పన్నాగం పన్నారు. జిల్లా ఉన్నతాధికారులకు షకీల్ షఫీపై పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

అందులో భాగంగా అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుని షకీల్ షఫీ ని ముతవల్లి పదవిని నుంచి తొలగించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ఆర్టీఐ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

## వ్యవస్థాపక అధ్యక్షుడు ఏ. హోన్నూరప్ప -కమిషనర్ కు ఆర్ టి ఐ సంఘం వినతి



**అనంతపురం ప్రతినిధి, జూలై 12,(రిపబ్లిక్ న్యూస్):** ఆర్టీఐ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని వ్యవస్థాపక అధ్యక్షుడు ఏ. హోన్నూరప్ప పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ గాజుల ఆదేన్నను అనంతపురం రోడ్లు పవనాల శాఖ కార్యాలయంలో ఆదివారం సమాచార హక్కు పరిరక్షణ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు ఏ. హోన్నూరప్ప ఆధ్వర్యంలో కమిషనర్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

**4(1)(బి) నిబంధనలను సక్రమంగా అమలు చేయడం లేదు**

ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలు ఆశించిన స్థాయిలో జరగడం లేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆర్టీఐ చట్టంలోని 4(1)(బి) నిబంధనలను అధికారులు సక్రమంగా అమలు చేయడం లేదని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఆర్టీఐ నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం కమిషనర్ కు ఆ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు.

**పారదర్శకమైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉంటా**

వినతిపత్రాన్ని స్వీకరించిన రాష్ట్ర సమాచార కమిషనర్ గాజుల ఆదేన్న స్పందిస్తూ, సమాచార హక్కు చట్టం సమర్థ అమలుకు తనకు ఉన్న అధికారాల పరిధిలో చిత్తశుద్ధితో పనిచేస్తానని హామీ ఇచ్చారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉంటానని, ప్రజల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుంటూ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డి. కృష్ణమూర్తి, తోట బాలన్న, వైస్ ప్రెసిడెంట్ డా. అంకె రామలింగయ్య, మనోజ్ కుమార్, ఆర్టీఐ మహిళా నాయకులు విజయలక్ష్మి, మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

# అనంత యాసకు పట్టంగట్టిన 'అతుకుల గుడిసె'

## మందల సురేష్ తొలి నవల ఆవిష్కరణలో వక్తల ప్రశంసలు






**అనంతపురం సాహిత్యం, జూలై 12 (రిపబ్లిక్ న్యూస్):** నవ యువ రచయిత మందల సురేష్ రచించిన తొలి నవల "అతుకుల గుడిసె" రాయలసీమ మాండలిక సాహిత్యంలో కొత్త ముద్ర వేసిందని పలువురు ప్రముఖ రచయితలు, సాహితీవేత్తలు కొనియాడారు. అనంతపురం జిల్లా యాసను సహజత్వంతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దళిత, బహుజన అస్తిత్వ జీవనాన్ని హృద్యంగా చిత్రించిన ఈ నవల సమకాలీన తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదిస్తుందని అభిప్రాయపడ్డారు. జిల్లా రచయితల సంఘం, 'డేగ' మాసపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలోని ఎన్‌జీఓ హోమ్ (ఏసీ హాల్)లో నిర్వహించిన నవల ఆవిష్కరణ సభ సాహితీ వాతావరణంలో ఘనంగా జరిగింది.

సభకు ప్రముఖ కవి, సాహిత్య విశ్లేషకుడు తూమచర్ల రాజారామ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ కవి, నవలా, నాటక రచయిత డా. వి.ఆర్. రాసాని పాల్గొన్నారు.

**నవలాకారుడు తెలుగు సాహిత్యానికి దొరికినట్లే**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలి రచనతోనే మందల సురేష్ తన రచనా ప్రతిభను చాటుకున్నారని, రాయలసీమ నుంచి మరో ప్రతిభావంతుడైన నవలాకారుడు తెలుగు సాహిత్యానికి దొరికినట్లేనని పేర్కొన్నారు. ప్రముఖ రచయిత డా. శాంతి నారాయణ నవలను ఆవిష్కరించగా, సాహిత్య విమర్శకుడు డా. కె. నాగేశ్వరాచారి నవలపై సమగ్ర సమీక్ష చేశారు. రాయలసీమ భాషా మాధుర్యం, సామాజిక వాస్తవికత, అణగారిన వర్గాల ఆత్మఘోషను రచయిత ఎంతో శక్తివంతంగా అక్షరీకరించారని ప్రశంసించారు. విశిష్ట అతిథులుగా దళిత సాహిత్య కవి వేముల ఎల్లయ్య, వైఎస్సార్సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, వి. శ్రీనివాసులు, సీనియర్ రచయిత సడ్లపల్లి చిదంబరరెడ్డి, డా. జెన్నె ఆనంద్ కుమార్, శీర్పి చంద్రశేఖర్, ఎం. హెచ్. రాయుడు, కంచపు లక్ష్మి తదితరులు పాల్గొని రచయితను అభినందించారు. డేగ బృందం సభ్యుడు షేక్ ఇక్రం బాష సభకు ఆహ్వానం పలకగా, మొండి వెంకటేష్ ఆలపించిన ఉద్దీపన గీతం ఆకట్టుకుంది.

**జిల్లా రచయితల సంఘం, డేగ బృందానికి కృతజ్ఞతలు**

రచయిత మందల సురేష్ మాట్లాడుతూ తన రచనకు లభిస్తున్న ఆదరణ ఆనందాన్ని కలిగిస్తోందని, నవల ప్రచురించిన జయంతి పబ్లికేషన్స్, అలాగే ఆవిష్కరణ నిర్వహించిన జిల్లా రచయితల సంఘం, డేగ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. జిరసం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్ పర్యవేక్షణలో, ప్రధాన కార్యదర్శి కోటిగారి వన్నప్ప, ఉపాధ్యక్షుడు గోసల నారాయణస్వామి సభను సమన్వయం చేశారు. సోమర రాహుల్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు కవులు, రచయితలు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

## యల్లటూరు శ్రీనివాసరాజు.



**రైల్వే కోడూరు జూలై 12 రిపబ్లిక్ న్యూస్.**
జనసేన పార్టీ అధినాయకుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అనారోగ్యం నుండి త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని రాజంపేట మన్నూరు శక్తి వంతమైన ఎల్లమ్మ తల్లి దేవాలయంలో రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జి ఎల్లటూరు శ్రీనివాసరాజు ప్రత్యేక పూజలు ఆదివారం నిర్వహించారు,

పవన్ కళ్యాణ్ కి ఇటీవల శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తై ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో, ఆయన త్వరితగతిన సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని మరింత ఉత్సాహంతో ప్రజాసేవలో కొనసాగాలని యల్లటూరు శ్రీనివాస రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అమ్మవారికి పవన్ కళ్యాణ్ పేరుపై అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయన ఆరోగ్య సంపూర్ణత కోసం ప్రార్థనలు చేశారు.
అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యల్లటూరు శ్రీనివాస రాజు మాట్లాడుతూ, గత పదేళ్లుగా రెండు భుజాలకు సంబంధించిన గాయాల కారణంగా తీవ్ర నొప్పిని ఎదుర్కొంటూనే పవన్ కళ్యాణ్ ప్రజా జీవితంలో తన బాధ్యతలను ఏమాత్రం విస్మరించలేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పర్యటనల్లో శారీరక ఇబ్బందులను సహిస్తూ ప్రజలను కలుసుకుని, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాల కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు.
ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్తు, సమాజ శ్రేయస్సు వంటి అంశాలపైనే నిరంతరం ఆలోచించే నాయకుడు పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావం, సేవా దృక్పథం, నిబద్ధత ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు వచ్చి మరింత శక్తివంతంగా ప్రజాసేవను కొనసాగించాలని అమ్మవారిని ప్రార్థించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, సాధక్‌లు, ఉద్యమకారులు, వీర మహిళలు, స్థానిక నాయకులు మరియు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.





# ప్రతిపక్షపార్టీకి షాకుల మీద షాకులు





## టిడిపిలోకి చేరికలు.

**రైల్వే కోడూరు జూలై 12 రిపబ్లిక్ న్యూస్.**
ప్రతిపక్ష పార్టీకి ఓబులవారిపల్లి మండలం లో షాకుల మీద సాకులు తగులుతూనే ఉన్నాయి, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అభివృద్ధి ముందుచూపు కొత్త కొత్త పథకాలు ఆశయాలు నచ్చి మండల కేంద్రం ఓబులవారిపల్లి పంచాయతీలో జూలై 5వ తారీఖున వైఎస్ఆర్సిపి పార్టీకి చెందిన పలు కుటుంబాలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకోవడం జరిగింది, జూలై 12న తిరిగి ఓబులవారిపల్లి మండల పరిధిలోని చెన్నరాజు పోడు గ్రామపంచాయతీ సోమాకులపల్లి గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలు రైల్వే కోడూరు పట్టణంలోని రాఘవరాజుపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం
రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపి పార్టీ ఇంచార్జ్, కూడా చైర్మన్ ముక్కారూపానందరెడ్డి మరియు యువనేత ముక్కా సాయి వికాస్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపికి జై కొడుతూ పచ్చ కండువాలు కప్పుకున్నారని ముక్కా రూపానందరెడ్డి అన్నారు, ఈ సందర్భంగా అయన కొత్తగా చేరిన వారికీ కండువా కప్పి సాదర స్వాగతంచెబుతూ పార్టీలోకి ఆహ్వానం పలికారు, కొత్తగా చేరిన పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమం అభివృద్ధి పాలన పట్ల అంకితభావం గల చంద్రబాబు నాయుడు పరిపాలనతో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కూడా చైర్మన్ ముక్కారూపానందరెడ్డి నాయకత్వం చొరవ అభివృద్ధి సంక్షేమం ప్రజా సంక్షేమం పట్ల ముక్కారూపానంద రెడ్డి చూపిస్తున్న చొరవ మరియు ముక్కారూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా చేస్తున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ముక్కారూపానందరెడ్డి నాయకత్వపటిమ వల్ల పార్టీలో చేరడం జరిగిందని తెలియజేశారు ముక్కారూపానంద రెడ్డి మాట్లాడుతూ రైల్వే కోడూరు నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు, పరిపాలన సంక్షేమ అభివృద్ధి కోసం పడుతున్న తపన చూసి ప్రజలు ఆకర్షితులై పార్టీ లో చేరడం తనకెంతో సంతోషాన్ని ఇస్తుందని నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలు ప్రేమాభిమానాలు వెలకట్టలేనివని ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ శిరస్సు వంచి పాదాభివందనాలు చేస్తున్నానని జూలై 2వ తారీఖున జి రాంజీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రారంభోత్సవంలో భాగంగా ముక్క వారి పల్లి పంచాయతీ నందు నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పాల్గొన్నారని రైల్వే కోడూరు నియోజకవర్గానికి పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ప్రకటించారని తెలిపారు,

# మహా "నంది"శ్వరుడికి ప్రదోషకాల అభిషేకం



**మహానంది, జూలై 12,(రిపబ్లిక్ న్యూస్):**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలోని మహానందీశ్వర స్వామి గర్భాలయం ఎదురుగా ఉన్న శ్రీ నందీశ్వర స్వామికి , నిజ జ్యేష్ఠ మాస బహుళ త్రయోదశి మహాప్రదోషం సందర్భంగా ఆదివారం ప్రదోష కాలంలో అభిషేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు తదితర బృందం ముందుగా గణపతి పూజ, పీఠార్చన, ద్రవ్య పూజలు చేశారు. నందీశ్వర స్వామికి సుగంధ ద్రవ్యాలతో, పంచామృతం, గంగాజలం, సుగంధ పరిమళ ద్రవ్యాలతో పాటు జలాభిషేకం, పాలాభిషేకం పూజలు జరిపారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆర్జిత సేవా టికెట్ల ద్వారా నందీశ్వర అభిషేకం పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు నందీశ్వర అభిషేకం తిలకించి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. పూజా కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.





# నిర్విరామంగా సర్ కార్యక్రమంలో పాల్గొని ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న తల్లెం భరత్ కుమార్ రెడ్డి.





**రైల్వే కోడూరు జూలై 12 రిపబ్లిక్ న్యూస్.**
ఓబులవారిపల్లి మండలం మంగంపేట గ్రామపంచాయతీలో వైసీపీ రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షులు, డి ఆర్ యు సి సి సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి నిర్విరామంగా సర్ కార్యక్రమం లో పాల్గొంటూ ఓటర్లకు అవగాహన కల్పిస్తూ , ఎన్యుమరేషన్ పత్రాలు ఎలా పూరించాలి ఇంకా ఇతర సమస్యలపై కూడా ఓటర్లకు తెలియజేస్తూ పంచాయతీలో తనదైన ముద్ర వేసుకుంటున్నారు. ఈ సందర్భంగా తల్లెం భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మంగంపేట గ్రామపంచాయతీలో 153,154,155,156,157 ల పోలింగ్ కేంద్ర పరిధిలో ఉన్న ఓటర్లంతా బిఎల్ఓ నుండి తీసుకున్నటువంటి ఎన్యుమరేషన్ పత్రాలను త్వరగా పూరించి వారికి అందజేయవలసిందిగా తెలియజేస్తూ ,ఒకవేళ పత్రాలను రాయడం తెలియని వారు ఎవరైనా ఉంటే బిఎల్ఓ మరియు బిఎల్ఏలు నేను అందుబాటులో ఉంటామని మా వద్దకు తీసుకువచ్చి మీ యొక్క సమాచారాన్ని తెలిపితే మీ ఎన్యూమరేషన్ పత్రాలలో పూరించి బిఎల్ఓ లకు అందజేయడం జరుగుతుందని తద్వారా మీ యొక్క ఓటు హక్కు పునరుద్ధరించుట కొరకు వీలు పడుతుందని తెలియజేస్తూ, ఈనెల 14వ తేదీకి సర్ కార్యక్రమ ప్రక్రియ గడువు ముగియనున్న నేపథ్యంలో ఎవరైతే పత్రాలు ఇవ్వలేదు వారంతా కూడా త్వరగా బిఎల్ఓ లకు అందజేయవలసిందిగా తెలియజేశారు. సర్ కార్యక్రమంపై ఏదైనా సందేహాలు ఉంటే మీకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని తెలియజేశారు.





# హోండా షోరూం ఎదురుగా వ్యక్తి మృతి.

**రైల్వే కోడూరు జూలై 12 రిపబ్లిక్ న్యూస్.**
రైల్వే కోడూరు పట్టణం బస్టాండ్ సమీపమునందు హీరోహోండా షోరూం ఎదురుగ ఒక వ్యక్తి మృతి చెందినట్లు బోలా శంకర్ సేవా సమితి అధ్యక్షుడు మండల నాగేందర్ తెలిపారు వివరాలకు వెళితే ఆదివారం మధ్యాహ్నంసుమారు ఒంటిగంట సమయమునుండి అక్కడే పడివున్నా వ్యక్తిని ఎవరు దగ్గరికి చేరి గమనించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి బోలో శంకర్ సేవా సమితికి ఫోన్ చేయగా అధ్యక్షుడు నాగేంద్ర స్పందించి శవం దగ్గరికి వచ్చి పరిశీలించగా అప్పటికే చనిపోయినట్లు తెలిసింది పరిసరాలలో విచారించగా అతను కర్నూలు డిస్ట్రిక్ట్ డ్రోన్ కు సంబంధించిన వ్యక్తి అని బ్రతుకుతెరువు కోసం బేల్దారి పని చేసుకుంటూ కోడూరులో అద్దెకు ఇల్లు తీసుకొనినివసిస్తున్నాడని , అతని ఇంటికి పక్కనే అన్న వదిన కూడా ఉన్నారని తెలుసుకొని సమాచారం ఇవ్వడంతో అతని అన్న మృతిని దగ్గరకు వచ్చి పరిశీలించి మా తమ్ముడు అని చెప్పి పేరు వెంకటేష్ అని వయసు సుమారు 50 సంవత్సరాలు ఉంటాయని మాది డ్రోన్ అని బ్రతుకుతెరువుకి ఇక్కడికొచ్చామని లబోదిబోమని ఏడవడం,కడుపేదవారమని శవాన్ని ఇంటికి తీసుకెళ్లడానికి స్తోమతలేదని బోలో శంకర్ సేవా సమితిని ఆశ్రయించగా ఆయన మృతదేహాన్ని స్వగ్రామం చేర్చడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలియజేశారు మందల నాగేంద్ర మాట్లాడుతూ ఇక్కడ శవం పడి ఉన్నట్లు సాయంత్రం నాలుగు గంటలలకు సమాచారం తెలిసిందని శవాన్ని వారి స్వగ్రామం చేర్చడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నాను అన్నారు మా సేవా సమితి నిరుపేదలకు అనాథలకు సంబంధించి మా వంతు సహాయ సహకారాలు చేస్తుంటామని ఆయన అన్నారు ఇంతవరకు సుమారు 30 అనాథ శవాలను మా సేవా సమితి ద్వారా దహన సంస్కారాలు నిర్వహించామన్నారు వృద్ధులకు పేదలకు మా వంతు సహకారం గా సమాచారం తెలిసిన వెంటనే స్పందించి వారికి ఎలాంటి సహాయ సహకారాలు అందించాలో మా సేవా సమితి ద్వారా చేస్తుంటామని ఆయన అన్నారు ఆదివారం మా దృష్టికి వచ్చిన ఈ మృతదేహాన్ని వారి స్వగ్రామానికి చేరుస్తామని వెంకటేష్ సోదరుడు శ్రీనుకు హామీ ఇచ్చినట్లు బోలాశంకర్ సేవా సమితి అధ్యక్షుడు మండల నాగేందర్ తెలియజేశారు.



# నీతి, నిజాయితీకి నిలువెత్తు రూపం కామ్రేడ్ వెంగమ నాయుడు

### మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు -29వ వర్ధంతి సందర్భంగా అన్నదానం

### కమ్యూనిస్టు పోరాటాల్లో వెంగమ నాయుడు పాత్ర కీలకం



**అనంతపురం సంక్షేమం, జూలై 12,(రిపబ్లిక్ న్యూస్):**
మాజీ సీపీఐ జిల్లా కార్యదర్శి, కమ్యూనిస్టు నాయకుడు పి. వెంగమనాయుడు నీతి, నిజాయితీకి నిలువెత్తు రూపమని మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు కొనియాడారు. ఆయన 29వ వర్ధంతి సందర్భంగా ఆదివారం అనంతపురం ప్రభుత్వాసుపత్రి వద్ద మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులకు భోజనాలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు నారాయణరెడ్డి, వి.కె. రంగారెడ్డి, తిరుపతయ్య మాట్లాడుతూ వెంగమనాయుడు సుదీర్ఘకాలం కమ్యూనిస్టు ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారని తెలిపారు. జీవితాంతం కమ్యూనిస్టు భావజాలానికి కట్టుబడి పేదలు, కార్మికులు, రైతుల హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేపట్టారని పేర్కొన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శమని అన్నారు. వెంగమనాయుడితో కలిసి పనిచేసే అవకాశం లభించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆకుతోటపల్లి నారాయణరెడ్డి, వై. మధుసూదన్‌రెడ్డి, వి.కె. రంగారెడ్డి, తిరుపతయ్య, రామచంద్రరెడ్డి, శంకర్‌రెడ్డి, అడ్వకేట్ సత్యనారాయణరెడ్డి, రామ్మోహన్, ఆర్టీసీ విశ్వనాథ్‌రెడ్డి, ఏఎస్ఐ ఓబుళపతి, ఉపాధ్యాయుడు అజయ్, సీనియర్ పాత్రికేయులు తలారి రామాంజనేయులు, బోగేశ్వరరెడ్డి, రేపటి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఇటిక్యాల వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 5 ట్రాక్టర్లను పట్టుకున్న మండల గిర్ధవార్ దాసరి పద్మయ్య



**రాయికల్ పట్టణం జూలై,12( రిపబ్లిక్ న్యూస్)**జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామ పరిధిలోగల పెద్దవాగునుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను మండల తాసిల్ గిర్ దవారు దాసరి పద్మయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు ఆకస్మిక తనిఖీల్లో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల కోసం మండల తాసిల్దార్ అధికారి అధీనంలోకి తీసుకున్నారు ఈ సందర్భంగా తాసిల్దార్ నాగార్జున మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు రవాణ చేయడం చట్టవిరుద్ధామని స్పష్టం చేశారు అక్రమంగా ఇసుక రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలుగడాము కాకుండా వాగులు నదుల సహజ స్వరూపం దెబ్బతింటుందని పేర్కొన్నారు అక్రమలకు పాల్పడే వారిపై కేసు నమోదు చేసి నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు అలాగే అక్రమ ఇసుక తవ్వకాలు లేదా రవాణా ఎక్కడైనా కనిపిస్తే వెంటనే మండల రెవిన్యూ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు ఇసుక మాఫియా పై నిరంతరం నిఘా కొనసాగుతుందని ఇటువంటి ప్రత్యేక తనిఖీలు మరింత చేస్తామని ఆయన హెచ్చరించారు

## ట్రిపుల్ ఐటీ కి ఎంపికైన విద్యార్థికి ఆర్థిక సహాయం



**రాయికల్ పట్టణం జులై,12(రిపబ్లిక్ న్యూస్ )**
జగిత్యాల్ జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉమ్మడి హర్షిని ట్రిబుల్ ఐటీ లో సీటు సాధించింది. ప్రోత్సాహకంగా విజేత యూత్ వారు 2500 రూపాయల ఆర్థిక సహాయం అందించారు
వీరు మాట్లాడుతూ... చదువులో, ఆటల్లో ప్రతిభ కనపరిచిన వారికి యూత్ తరుపున సహాయకరంగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు రాజ్ గోపాల్, లక్ష్మి నారాయణ, దిలిప్ కుమార్, నరేష్, రంజిత్ పాల్గొన్నారు.

## రాయికల్ పట్టణ వారాసంతలో పోలీసులు బార్కెట్లు పెట్టిన మారరా!! సంతలో ట్రాఫిక్ జామ్-?

**-వారి పై పోలీసులు కఠినంగా వ్యవహరించాలి పట్టణ ప్రజల విన్నపం**




**రాయికల్ పట్టణశీ జులై,12(రిపబ్లిక్ న్యూస్ )**
రాయికల్ పట్టణ వారసంతతో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి అని అధికారులకు పాలకులు చెప్పిన ఫలితం శూన్యమని ప్రజలు అంటున్నారు ఎన్నో వినతి పత్రాలు ఇచ్చామని అయినా పట్టించుకోకపోవడం రాయికల్ ప్రజల దురదృష్టం
50 గ్రామాలకు కూడలి అయిన కూరగాయల సంతగా పేరుగాంచిన జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో ప్రతి శనివారం వారసంత లో ట్రాఫిక్ సమస్యగా మారింది గతంలో ఈ వారసంతలో వాహనాలు ఢీకొట్టి ఒక మహిళ మృతి చెందడం కూడా జరిగింది సంతలోకి వాహనాలు రాకుండా మున్సిపల్, పోలీస్ అధికారులు బార్కెట్లు పెట్టి ఏర్పాటుచేసిన ప్పటికీ ద్విచక్ర వాహనదారులు కార్లు బస్సు డ్రైవర్లు నిర్లక్ష్యంగా లోపలికి రావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి కూరగాయలకు విక్రయిదారులు కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు పోలీసులు నిగా పె శీచలి వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు

# అనిర్వచనీయమైన అనుభూతి నిచ్చే తిరుమల సేవలు

**కౌసల్యా సుప్రజారామ! పూర్వా సంధ్యా ప్రవర్తతే/ ఉత్తిష్ఠ నరశార్దూల! కర్తవ్యం దైవమాహ్నికమ్//**

**రాయికల్ పట్టణం జులై,12( రిపబ్లిక్ న్యూస్)**
ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన తిరుమల క్షేత్రం లో వివిధ రకాల సేవలు అందించే శ్రీవారి భక్తులు అనిర్వచనీయమైన అనుభూతిని పొందుతున్నారని జగిత్యాల జిల్లా రాయికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు పండితులు చెరుకు మహేశ్వర శర్మ తెలిపారు. టిటిడి వారి పరకామణి సేవకు పొరండ్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గుండు వెంకట రామకృష్ణ తో కలిసి వెళ్ళిన
ఆయన తిరుమల తిరుపతి దేవస్థానములు, వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవారిసేవ వివరాలను వివరించారు.
శ్రీవారి సేవ స్వచ్ఛందసేవ. ఇది యాత్రికులకు సహాయ నిమిత్తం ఏర్పాటు చేశారు . సేవకు వచ్చే భక్తులు ఎవ్వరికి ధనరూపంగా వస్తురూపంగా ఎటువంటి చెల్లింపులు చేయనవసరం లేదని అన్నారు. శ్రీవారిసేవకు వచ్చుటకు ఆసక్తిగలవారు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొనవచ్చుని.,వివరములకు - www.srivariseva.tirumala.org ద్వారా పొందవచ్చునని అన్నారు శ్రీవారి సేవకులుగా హిందువులను మాత్రమే అనుమతిస్తారని తెలిపారు.
శ్రీవారి సేవకుల వయస్సు ఖచ్చితంగా 18 సం॥ పైన మరియు 60 సంవలు లోపు ఉండవలెను.



ప్రతి టీమ్ లోను 10 మందికి తక్కువ కాకుండా 15 మందికి ఎక్కువ కాకుండా సభ్యులుండవలెను.. శ్రీవారి సేవకు ఒక్కరు కూడా ఆన్లైన్లో వ్యక్తిగతంగా రిజిస్టర్ చేసుకొని సేవకు రావచ్చునని,పరకామణి సేవకు, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో విధులు నిర్వహించే ఉద్యోగస్తులు అర్హులని ఆయన అన్నారు. శ్రీవారి సేవకులకు చదువుట. వ్రాయుట తప్పక తెలిసి ఉండాలని అన్నారు . శ్రీవారి సేవకులందరూ తిరునామం, తిలకం, కుంకుమ లేక చందనం బొట్లు స్పష్టంగా కనిపించేటట్లు ధరించాలని అన్నారు శ్రీవారి సేవకుల ఆధార్ కార్డు నెంబర్లను సి.ఆర్.ఓ. వద్ద భక్తుల కొరకు ఏర్పాటు చేసిన లక్కీడిప్ / అంగప్రదక్షణం / కరెంటు బుకింగ్ లోని ఆర్జిత సేవా




టిక్కెట్లో అనుసంధానం చేసిన కారణమున ఏ విధమైన టిక్కెట్లు ఇవ్వరని అన్నారు.
శ్రీవారి సేవా కార్యాలయం వారు ఇచ్చిన స్కార్ఫులను, ఐ.డి. కార్డు కవరు. ట్యాగ్ లను సేవల అనంతరం, సేవా ఆఫీసు వారికి తిరిగి అప్పగించవలెను.
ఇచ్చిన సేవను శ్రద్ధతో, క్రమశిక్షణతో, భక్తితో నిర్వహించాలని. సేవాసదన్ నందు నమోదు చేసుకొన్న తరువాత తిరుమలలో టి.టి.డి. వారు ఇచ్చిన వసతి సముదాయంలో ఉంటూ , ఇచ్చిన సేవలను పూర్తి సమయము వరకు నిర్వహింపవలెనని అన్నారు. మూడు, నాలుగు,ఏడు రోజులు సేవా సమయం మధ్యలో తిరుమల వదలి వెళ్ళకూడదనే నియమం పాటించాలని సూచించారు. మహిళా సేవకులు, పురుష సేవకులకు విడి విడిగా వసతి కల్పిస్తారని ,ఆ వసతి సముదాయంలోనే ఉండాలని అన్నారు .అనారోగ్యంతో ఉన్న వారు శ్రీవారి సేవకు రాకూడదని సేవ లో సమయపాలన, ఆజ్ఞాపాలన, కర్తవ్యపాలన తప్పక పాటింపవలెనని పేర్కొన్నారు. సేవా సమయము నందు సేవకులు 'గోవింద' అని నామస్మరణ ప్రేమతో, భక్తితో చేయుచూ సేవలను నిరాడంబరముగా, పవిత్రముగా చేయవలయును. శ్రీవారి సేవకులు భక్తులతో వాదనలు చేయరాదని పురుషులు తెలుపు రంగు వస్త్రాలు, స్త్రీలు మెరూన్ బార్డర్తో కూడిన ఆరెంజ్ కలర్ చీర మరియు వి-నెక్ కలిగిన మెరూన్ కలర్ రవిక ధరించవలెనని తెలిపారు
శ్రీవారి సేవకులు నిర్ణయించిన డ్యూటి తేదీలు పూర్తి అయిన తరువాత మాత్రమే శ్రీవారి దర్శనం, తలనీలాలు, మ్రొక్కు చెల్లించుట చేయవలెను. సేవా కార్యక్రమాల్లో పాల్గొనే వారు గుట్కా, పాన్పరాగ్, ధూమపానం మొదలగు పొగాకు సంబంధించినవి వాడటం నేరమని తెలిపారు .పరకామణి సేవలో పాల్గొనేవారు విజిలెన్స్ సిబ్బంది సూచనల మేరకు కొన్ని ప్రత్యేక నియమనిబంధనలు పాటించాలని ఆయన అన్నారు
టి.టి.డి. నియమాలను తప్పని సరిగా పాటిస్తూ శ్రీవారి సేవ చేసే వారికి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి అనుగ్రహం అందుతుందని చెరుకు మహేశ్వర శర్మ పేర్కొన్నారు.

## మనిషి పెద్దపులి వేషాదారానాను చూసి కోతులు పరార్ !!

**భూపతిపూర్ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం లో వింత ఘటన**



**రాయికల్ పట్టణం జులై 12( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కోతులు ఆగడలు రోజురోజుకు పెరుగాయి ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడుతుండడంతో ఓ భక్తుడు వినూత్న మార్గాన్ని ఎంచుకున్నారు శనివారం ఆయన ఏకంగా పెద్దపురి వేషధారణలో చేరుకున్నారు కోతులను భయపెట్టి పారదోలు ప్రయత్నం చేశారు ఈ వినుతానా ప్రయత్నం స్థానికంగా హాట్ టాపిక్ గా మారింది

## వర్షాలు కురవాలని రాయికల్ పట్టణ శివాజీ రైతు గోనే రెడ్డి సంఘ ఆధ్వర్యంలో దేవాలయాల్లో జలాభిషేకం





**రాయికల్ పట్టణం జూలై,12( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల్ జిల్లా రాయికల్ పట్టణం లో శివాజీ రైతు గోనే రెడ్డి సంఘ అధ్యక్షులు కుంభాల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వర్షాలు కురవాలని, వ్యవసాయ పంటలు పండాలని
రైతులు బాగుండాలని కోరుతూ కప్పతోలు ఆటలు పెద్ద ఎత్తున రైతులు రాయికల్ చెన్న కేశవనాధా పంచముఖ లింగేశ్వర స్వామి ఆలయము, శివాలయము, భీమన్న గుడి, గంగమ్మ గుడి & హనుమాన్ గుడిలలో శివలింగానికి జలాభిషేకం మరియు ప్రత్యేక పూజలు నిర్వహించినారు.
ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు



# అందోల్ కస్తూర్బా హాస్టల్‌లో విద్యార్థినుల ఆందోళన

**మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్**

**ఇద్దరు ప్రిన్సిపాళ్ల మధ్య ఆధిపత్య పోరు.. ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు**





**ఆందోల్ ప్రతినిధి జులై 12 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
అందోల్ కస్తూర్బా బాలికల పాఠశాల, హాస్టల్‌లో మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందని ఆరోపిస్తూ విద్యార్థినులు ఆదివారం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వారు నిరసన వ్యక్తం చేశారు.
తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం, వట్పల్లి కస్తూర్బా పాఠశాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థినులను అందోల్ కస్తూర్బా హాస్టల్‌కు తరలించగా, ఇప్పటికే అక్కడ సుమారు 300 మంది విద్యార్థినులు ఉండటంతో రెండు హాస్టల్లో కలిపి విద్యార్థినులు మొత్తం 500 మంది కాగా హాస్టల్‌పై తీవ్ర ఒత్తిడి ఏర్పడిందని ఆరోపించారు.
విద్యార్థినులకు పడుకోవడానికి సరిపడా పడకలు లేకపోవడంతో ఒకే మంచంపై ముగ్గురు, నలుగురు కలిసి నిద్రించాల్సి వస్తోందని వారు తెలిపారు. తాగునీటి సమస్యతో పాటు హాస్టల్ గదులు పరిశుభ్రంగా లేవని కూడా ఆరోపించారు. అలాగే వట్పల్లి విద్యార్థినులకు అందోల్ హాస్టల్ విద్యార్థినులు భోజనం చేసిన తర్వాతే భోజనం అందిస్తున్నారని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.
"గురుకులంలో సీట్లు లేకపోతే ఇంతమంది విద్యార్థినులను ఎందుకు చేర్చుకున్నారు? వారి వసతి, భోజన ఏర్పాట్లు చేయకుండా ఇలా ఇబ్బందులకు గురి చేయడం సరైనదేనా?" అని తల్లిదండ్రులు ప్రశ్నించారు.
వెంటనే అదనపు వసతి, పడకలు, తాగునీటి సౌకర్యం, పరిశుభ్రత కల్పించి ప్రిన్సిపల్ పరమేశ్వరుని వెంటనే సస్పెండ్ చేయాలని విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు పై అధికారులను డిమాండ్ చేశారు.

## ఆంధ్ర ప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కోల్కోవాలని దేవాలయాల్లో పూజలు జనసేన పార్టీ కార్యకర్తలు నాయకులు

**రాయికల్ పట్టణం జూలై 12 ( రిపబ్లిక్ న్యూస్)**



నిన్న ముంబయిలో కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న మా ప్రియతమ నాయకులు, ఆంధ్రప్రదేశ్ గౌరవ ఉప ముఖ్యమంత్రి వర్యులు జనసేన పార్టీ అధ్యక్షులు మాన్య కొణిదెల పవన్కళ్యాణ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని జనసేన పార్టీ కార్యకర్తలు నాయకులు కోరారు నేటిసమాజానికి మరియు నాలాంటి ఎంతో మందికి మీ సంకల్పం, మీఆశయం , ప్రజల పట్ల మీకు వున్న అంచెలంచెలమైన విశ్వాసం, సేవాభావం కల్గిన మీరు ఎల్లప్పుడూ కార్యకర్తలకు ఎంతో స్ఫూర్తిదాయకం.కోండగట్టు ఆంజనేయస్వామి ఆశీస్సులు, కనకదుర్గమ్మ తల్లి ఆశీస్సులు మీయందు ఎల్లవేళలా వుండాలని, మీరు త్వరగా కోలుకుని, తిరిగి ప్రజలకు మరింత శక్తితో మీ సేవా కార్యక్రమాలను మునుపటిలా తిరిగి విజయవంతంగా పూర్తి చేయుటకు ఆ కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి వారి ఆశీస్సులు ఉండాలని వారు కోరారు

# మురుగన్ నేపథ్యంలో చిత్రాలు

## తెలుగు, తమిళంలో కార్తికేయుడి నేపథ్యంలో సినిమాలు







దక్షిణాది సినీ పరిశ్రమలో దైవిక, పురాణ గాథల నేపథ్యానికి నయా క్రేజ్ మొదలైంది. ఒకప్పుడు పౌరాణిక కథలకు కేరాఫ్ అడ్రస్‌గా కోలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలు మళ్లీ అదే బాట పట్టినట్లు తెలుస్తున్నాయి. ప్రస్తుతం తమిళ, తెలుగు సినీ రంగాలలో లార్డ్ మురుగన్ (సుబ్రమణ్య స్వామి) కాన్సెప్ట్ ఒకవైపు భారీ ట్రెండ్‌గా మారుతోంది. టాలీవుడ్, కోలీవుడ్ ప్రముఖ దర్శకులు, అగ్ర హీరోలు మురుగన్ బ్యాక్‌డ్రాప్‌లో ప్రతిష్టాత్మక చిత్రాలను ప్రకటించడం సోషల్ మీడియా వ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ట్రెండ్‌ను మొదటిగా కోలీవుడ్ హీరో శివకార్తికేయన్ ప్రారంభించాడు అని చెప్పవచ్చు. శివకార్తికేయన్ పుట్టినరోజు పురస్కరించుకుని విడుదలైన ఒక గ్లింప్స్ ఇటీవలే అందరి దృష్టిని ఆకర్షించింది. శివకార్తికేయన్ ప్రధాన పాత్రలో లోకనాయకుడు కమల్ హాసన్ భారీ నిర్మాణంలో, శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'సేయోన్' అనే చిత్రం ఈ మురుగన్ సెంటిమెంట్‌కు పునాది వేసింది. తమిళ ప్రాచీన సంస్కృతి, సాహిత్యంలో కార్తికేయుడిని 'సేయోన్' అని పిలుస్తారు. ఈ చిత్ర గ్లింప్స్‌లో శివకార్తికేయన్ విరుమాండి స్వామి పూనకం వచ్చినట్లుగా, అత్యంత ఊరమాస్ లుక్‌లో పల్లెటూరి జాతర నేపథ్యంలో కనిపించి అభిమానులను అలరించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ యాక్షన్ డ్రామాను అక్టోబర్ లో గ్రాండ్‌గా విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ మరియు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఒక భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ అనౌన్స్ అయింది. ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ విస్తృతంగా ప్రచారంలో ఉంది. దీంతో ఈ ప్రాజెక్ట్ కూడా మురుగన్ జీవితంపై రాబోతుండడంతో టాలీవుడ్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఈ సినిమా ప్రకటన సమయంలో నిర్మాత నాగవంశీ సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్ తీవ్ర వివాదానికి దారితీసింది. మురుగన్ స్వామి 'ఉత్తరాదిన జన్మించాడు.. దక్షిణాదిన పూజించబడుతున్నాడు' అంటూ ఆయన పేర్కొన్న వ్యాఖ్యలపై తమిళనాడులో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తమిళులు తమ ప్రాచీన దేవుడైన 'తమిళ్ కడవుల్' (తమిళ దేవుడు) మురుగన్‌ను ఉత్తరాది మూలాలతో ముడిపెట్టడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఎన్టీఆర్ సినిమాపై ఈ రకమైన రాజకీయ, ప్రాంతీయ దుమారం రేగుతున్న తరుణంలోనే, ధనుష్ మరియు వెట్రిమారన్ కాంబినేషన్‌లో 'తమిళ్ మురుగన్' ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ ఫస్ట్ లుక్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్‌లో ధనుష్ ఒక భారీ ఏనుగుపై గంభీరంగా కూర్చొని, చేతిలో మురుగన్ స్వామి యొక్క శక్తివంతమైన ఆయుధం 'వేల్' (ఈటె) పట్టుకుని, ఒక భారీ సైన్యం ముందు తమిళ ప్రజలకు, ఆ నేలకూ రక్షకుడిగా కనిపించారు. అయితే ఒకప్పుడు భక్తిరస చిత్రాలుగా వచ్చిన దేవుళ్ల కథలు, ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీలో భారీ బ్జడెట్ యాక్షన్ డ్రామాలుగా, అలాగే ప్రాంతీయ అస్తిత్వానికి ప్రతీకలుగా మారుతున్నాయి.

# అఖిల్‌కు హిట్ ఇమ్మని శ్రీవారిని కోరుకున్నా

## లెనిన్ సక్సెస్ మీట్‌లో నాగార్జున




తిరుమల శ్రీవారి దర్శనానికి ఎప్పుడెళ్లినా తాను ఏం కోరుకోనని.. కానీ, ఇటీవల వెళ్లినప్పుడు మాత్రం అఖిల్‌కు మంచి హిట్ ఇవ్వమని కోరుకున్నట్లు నాగార్జున తెలిపారు. అఖిల్ హీరోగా మురళీ కిషోర్ అబ్బూరి తెరకెక్కించిన 'లెనిన్' తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో నాగార్జున మాట్లాడుతూ.. అఖిల్‌కు విజయాన్ని ఇవ్వాలనే ఏకైక లక్ష్యంతో టీమ్ అంతా కలిసి కట్టుగా వర్క్ చేసిందన్నారు. సినిమాకు అడగ్గానే వాయిస్ ఓవర్ ఇచ్చిన మా పెద్దబ్బాయ్ తారక్‌కు ధన్యవాదాలు. సరిగ్గా ఏడాది క్రితం 'తండేల్' సక్సెస్‌మీట్‌కు వచ్చాను. ఇప్పుడు 'లెనిన్' ఈవెంట్.. నాగచైతన్య, అఖిల్ ఇద్దరూ నాకు రెండు కళ్లు. 'లెనిన్' దర్శకుడు మురళీ కిషోర్, ఎడిటర్ నవీన్ ఇద్దరూ పనిరాక్షసులు. భాగ్యశ్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. ఈ చిత్రాన్ని అంగీకరించినందుకు ఆ అమ్మాయికి థాంక్స్ చెప్పాలి. సినిమా విడుదలకు ముందు రోజు రాత్రి భాగ్యశ్రీ ఫోన్ చేసి టెన్షన్ పడింది. తాను ఎంతో కష్టపడుతున్నాననీ కానీ, సరైన గుర్తింపు రావట్లేదని బాధపడింది. 'కష్టానికి తగిన ప్రతిఫలం కచ్చితంగా వస్తుందని చెప్పా. అదే నిజమైంది. ఈ సినిమా విజయంలో నాగవంశీ ముఖ్యపాత్ర పోషించారని టీమ్‌కు థాంక్స్ చెప్పారు. ఇక అఖిల్ గురించి మాట్లాడుతూ.. ఏది అనుకున్నా దాన్ని కచ్చితంగా సాధించాలనే తపన చిన్నప్పటి నుంచి ఉంది. ఎంతో ఎనర్జిటిక్‌గా ఉంటాడు. ఇప్పటి వరకూ ప్రతి సినిమాకు వందశాతం న్యాయం చేశాడు. కానీ, హిట్ కొట్టలేకపోయాడు. 'లెనిన్'తో సరైన హిట్ పడింది. ఈ సినిమాకు ముందు ఒక ప్రమాదంలో అఖిల్ చేతికి దెబ్బతగిలింది. చాలా రోజులు చేయి పనిచేయలేదు. మళ్లీ మాములుగా వస్తుందా లేదా అని అందరం టెన్షన్ పడ్డాం. ఆ సమయంలో అఖిల్‌లో చాలా మార్పు వచ్చింది. దేని గురించైనా నిదానంగా ఆలోచించడం నేర్చుకున్నాడు. అదే సమయంలో పెళ్లి అయింది. వాడికంటూ ఓ తోడు వచ్చింది. గుడ్ టైం ప్రారంభమైందనిపించిందని చెప్పారు. అక్కినేని అభిమానులకు నాగార్జున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# భాగ్యశ్రీ ..భావోద్వేగం

'లెనిన్'లో అఖిల్‌కు జోడీగా భారతి పాత్రలో నటించి ఆకట్టుకున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. ఈ సినిమా కోసం టీమ్ ఎంతో కష్టపడిందని ఆమె తెలిపారు. తాజాగా ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో భాగ్యశ్రీ మాట్లాడుతూ.. తన అభిమానులు తనను నిరంతరం ప్రోత్సహిస్తూనే ఉన్నారని ఈ చిత్రబృందంతో పాటు వాళ్లందరి వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. హైదరాబాద్ తనకు కర్మభూమి అని చెప్పారు.

# ఓ సుకుమారి ట్రైలర్ విడుదల

'మసూద', 'పరేషాన్' చిత్రాలతో వైవిధ్యమైన నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న తిరువీర్, టాలెంటెడ్ బ్యూటీ ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటించిన లేటెస్ట్ మూవీ 'ఓ సుకుమారి'. భరత్ దర్శన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫీల్ గుడ్ మ్యూజికల్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అధికారిక ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక అందమైన గ్రామీణ నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథ, ఆ తర్వాత వారి జీవితాల్లో వచ్చే మలుపుల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. తిరువీర్ తన మార్క్ సహజ నటనతో ఆకట్టుకోగా, ఐశ్వర్య రాజేష్ మరోసారి నటన ప్రాధాన్యమున్న పాత్రలో మెరిశారు. భరత్ మంచిరాజు అందించిన స్వరాలు, నేపథ్య సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సున్నితమైన భావోద్వేగాలు, చక్కటి వినోదంతో కూడిన ఈ చిత్రం జూలై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.




# షూటింగ్ లో గాయపడ్డ రాశి ఖన్నా

బిజీ కథానాయిక రాశి ఖన్నా షూటింగ్ సెట్‌లో గాయపడ్డారు. ప్రస్తుతం టాలీవుడ్ కంటే తమిళ్, హిందీ ప్రాజెక్టులపైనే ఎక్కువగా ఫోకస్ పెట్టిన ఈ బ్యూటీ.. బాలీవుడ్‌లో అక్షయ్ కుమార్, విద్యా బాలన్ ప్రధాన పాత్రల్లో అనీస్ బజ్మీ తెరకెక్కిస్తున్న ఓ భారీ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఒక కీలకమైన యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో రాశి ఖన్నాకు గాయాలయ్యాయి. ఈ విషయాన్ని ఆమె స్వయంగా సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. యాక్షన్ సీన్స్ చేస్తున్నప్పుడు దెబ్బలు తగిలినప్పటికీ, రాశి ఖన్నా ఎక్కడా బ్రేక్ తీసుకోలేదు. తన వల్ల షూటింగ్‌కు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో గాయంతోనే ఆ షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ఒక ఫీమేల్ యాక్టరై ఉండి కూడా డూప్ లేకుండా క్లిష్టమైన స్టంట్స్ చేయడం, గాయపడినా వెనకడుగు వేయకపోవడంతో ఆమె అంకితభావాన్ని చూసి నెటిజన్లు, అభిమానులు సెల్యూట్ చేస్తున్నారు.ఇక తెలుగు సినిమాల విషయానికి వస్తే.. రాశి ఖన్నా ఇటీవల నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మ్యాజిక్ చేయలేకపోయింది. కమర్షియల్‌గా ఈ సినిమా నిరాశపరచడంతో పాటు, ఇందులో ఆమె పోషించిన క్యారెక్టర్‌కు కూడా పెద్దగా స్కోప్ లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఈమె ఆశలన్నీ బాలీవుడ్ ప్రాజెక్టులపైనే ఉన్నాయి.





# 'తక్షకుడు' షూటింగ్ పూర్తి చేసిన ఆనంద్ దేవరకొండ..

ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న 'తక్షకుడు' సినిమా షూటింగ్ పూర్తైంది. ఈ విషయాన్ని ఆయన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించారు. నటుడిగా తనకు అత్యంత సంతృప్తినిచ్చిన చిత్రాల్లో ఇదొకటని చెప్పారు. 'మిడిల్ క్లాస్ మెలోడీస్' తర్వాత దర్శకుడు వినోద్ అనంతోజుతో మళ్లీ పని చేయడం ఆనందంగా ఉందన్నారు. కథను, నటుడిని విభిన్నంగా చూసే దర్శకుడు ఆయన అని ప్రశంసించారు. తెలుగు ఫోక్‌లోర్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఆనంద్ దేవరకొండ అంధుడి పాత్రలో కనిపించనున్నారు. గ్రామస్థుల మరణాలకు కారణమైన వారిపై తన పెంపుడు కుక్కతో కలిసి ప్రతీకారం తీర్చుకునే వ్యక్తిగా నటిస్తున్నారు. ఈ పాత్ర తనకు సవాల్‌గా అనిపించిందని, అదే సమయంలో ఎంతో ఆసక్తికరంగా కూడా ఉందని తెలిపారు. లుక్ టెస్ట్ స్కెచ్‌లు, షూటింగ్ సమయంలో తీసిన ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు.సినిమాలో తనతో కలిసి నటించిన 'బెర్లిన్' అనే కుక్కతో మంచి అనుబంధం ఏర్పడిందని ఆనంద్ తెలిపారు. దర్శకుడు భావోద్వేగాలకు తగ్గట్టుగా సహజమైన యాక్షన్ చేయించారని వెల్లడించారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన వచ్చిందని, త్వరలో నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలయ్యే 'తక్షకుడు' ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# 24న రామాయణ ట్రైలర్ విడుదల




భారతీయ చిత్ర పరిశ్రమ చరిత్రలోనే భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. విడుదలకు ముందే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఇదీ ఒకటి. ఈ మూవీలో రాముడిగా బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తాజాగా చిత్రబృందం ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని ప్రకటించింది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ఇన్‌స్టా వేదికగా వెల్లడించింది. కొన్ని వేల సంవత్సరాలుగా ధర్మం, మర్యాద, ధైర్యం, కరుణ అనే ఆదర్శాలతో 'రామాయణం' ఎన్నో తరాలకు స్ఫూర్తినిచ్చింది. మన నాగరికతకు అద్దం పట్టే ఈ గొప్ప ఇతిహాసాన్ని ప్రపంచానికి సరికొత్తగా పరిచయం చేయబోతున్నాం అని ఇన్‌స్టాలో చిత్రబృందం పోస్ట్ చేసింది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవితో పాటు పలువురు అగ్ర తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తీస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా తెలిపారు.

## నంద్యాల ట్రాఫిక్ సీఐగా ఆర్.జే. సుబ్రహ్మణ్యం




**నంద్యాల క్రైం జూలై 12, (రిపబ్లిక్ న్యూస్ )**
నంద్యాల ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ)గా ఆర్.జే. సుబ్రహ్మణ్యం ఆదివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ క్రమశిక్షణపై పలు కీలక సూచనలు చేశారు. ప్రజల సహకారంతో నంద్యాల పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించి, ప్రమాద రహిత రవాణా వ్యవస్థ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజల సహకారంతో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. అతి వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి ఉల్లంఘనలకు పాల్పడవద్దని సూచించారు.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సురక్షిత నంద్యాల నిర్మాణంలో ప్రతి పౌరుడు పోలీసులకు సహకరించాలని కోరారు.ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తేనే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని నూతన ట్రాఫిక్ సీఐ ఆర్.జే. సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాలు వెంటనే సమర్పించాలి

### : ఈఆర్వో చల్లా ఓబులేసు -ఎస్ఐఆర్ ప్రత్యేక శిబిరాలకు విశేష స్పందన

### రెండు రోజుల్లో 22 వేల మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 12)**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే పూర్తి చేసి బీఎల్వోలకు సమర్పించాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో), నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపునిచ్చారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రెండో రోజు నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రత్యేక శిబిరాలను ఆయన పరిశీలించారు.





ఈ సందర్భంగా మాట్లాడిన ఈఆర్వో చల్లా ఓబులేసు, భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ప్రతి ఓటరు చురుకుగా పాల్గొనాలని కోరారు. ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా బీఎల్వోకు సమర్పించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు.
శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక శిబిరాలకు అనూహ్య స్పందన లభించిందని ఆయన తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన శిబిరాల్లో సుమారు 22 వేల మంది ఓటర్లు పాల్గొని ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేసుకున్నారని వెల్లడించారు. ఈ ప్రక్రియ ఈ నెల 14వ తేదీతో ముగియనున్నందున మిగిలిన ఓటర్లు కూడా ఆలస్యం చేయకుండా తమ వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు.
ఇంకా ఎవరికైనా ఎన్యూమరేషన్ ఫారం అందకపోయినా లేదా అందిన ఫారాన్ని బీఎల్వోకు సమర్పించకపోయినా వెంటనే సంబంధిత బీఎల్వోను సంప్రదించి ప్రక్రియ పూర్తి చేసుకోవాలని, తద్వారా ఓటు హక్కు భద్రంగా ఉండేలా చూసుకోవాలని ఈఆర్వో చల్లా ఓబులేసు విజ్ఞప్తి చేశారు.

## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, (ఏఎస్డి) పరిశీలనలో నిర్లక్ష్యం వద్దు

### ప్రత్యేక ఓటరు జాబితా సవరణ శిబిరాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 12)**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పాణ్యం నియోజకవర్గ ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ఆదేశించారు.
కల్లూరు అర్బన్ పరిధిలోని అబ్బాస్ నగర్, కృష్ణానగర్, న్యూ కృష్ణానగర్, షరీన్ నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) శిబిరాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి శిబిరాల నిర్వహణ, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.



ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఏఈఆర్ లు, బీగల్వో లు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని వేగవంతం చేసి ప్రతి ఇంటికీ చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్త ఓటరు నమోదులు, పేరు, చిరునామా తదితర సవరణల దరఖాస్తులను సకాలంలో స్వీకరించి, త్వరితగతిన పరిశీలించి నిర్ణీత గడువులోపు డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.
అలాగే (ఏఎస్డి) పరిశీలనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, డూప్లికేట్ నమోదులను క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో ధృవీకరించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
ఈ తనిఖీ కార్యక్రమంలో కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లకు కర్నూలు పోలీసుల కౌన్సిలింగ్

### నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని సూచన

### చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 12)**జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి కర్నూలు పోలీసులు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు రౌడీ షీటర్లకు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సమాజంలో గౌరవప్రదమైన జీవనం సాగించాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు.
అలాగే భవిష్యత్తులో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు గుర్తిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం ఇటువంటి కౌన్సిలింగ్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు

## జూలై 14న ఫ్యాప్టో ధర్నా -ఉద్యోగులు, ఉపాధ్యాయులు భారీగా పాల్గొనాలి

### జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ, -అనంతరం పికెటింగ్ ఆర్థిక డిమాండ్ల సాధన కోసం ఐక్య ఉద్యమానికి ఫ్యాప్టో పిలుపు

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 12)**
ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న ఫ్యాప్టో ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఫ్యాప్టో కో-చైర్మన్ ప్రకాశ్‌రావు, కర్నూలు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎం. మధుసూదన్‌రెడ్డి, జిల్లా సెక్రటరీ జనరల్ భాస్కర్ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.వారి ప్రకటన ప్రకారం, జూలై 14న ఉదయం 9 గంటలకు కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమై జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుంటుంది. అనంతరం ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్ ఎదుట శాంతియుత పికెటింగ్ నిర్వహించనున్నారు.ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆర్థిక పరమైన డిమాండ్ల పరిష్కారం కోసం చేపడుతున్న ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ




పాల్గొనాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ పోరాటంలో భాగస్వామ్యం కాకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు భవిష్యత్తులో నష్టం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో అనుబంధ సంఘాలైన యూటీఎఫ్, ఎస్టీయూ, ఏపీటీఎఫ్-257, ఏపీటీఎఫ్-1938, ఆప్టా, ప్రధానోపాధ్యాయుల సంఘం, డీటీఎఫ్, ఎస్సీ-ఎస్టీ ఉపాధ్యాయ సంఘం, పీఈటీ అసోసియేషన్, ఏప్రిటా తదితర సంఘాలు పాల్గొంటున్నాయని తెలిపారు.
అలాగే ఇతర ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలన్నింటినీ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. సోదర ఉపాధ్యాయ సంఘాలు కూడా ఈ పిలుపును స్వీకరించి ఉద్యమానికి మద్దతు తెలపాలని కోరారు.
జూలై 14న ఉదయం 9 గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు విజ్ఞప్తి చేశారు.

## జులై 13సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

### జిల్లా ప్రజలు గమనించాలి -జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**ఓర్వకల్లు ప్రతినిధి, జులై 12 (రిపబ్లిక్ న్యూస్)**
కర్నూలు, జూలై 12: జిల్లాలో సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో జిల్లా అధికారులు, మండల, డివిజన్ స్థాయి అధికారులు విధులు నిర్వర్తిస్తున్నందున ఈనెల 13 వ తేదీన సోమవారం జిల్లా, డివిజన్,మండల స్థాయిలో నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.
పిజిఆర్ఎస్ కార్యక్రమం రద్దు విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని, ప్రజలు అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్ కు రాకూడదని తెలిపారు. అలాగే డివిజన్, మండల స్థాయిలో కూడా పిజిఆర్ఎస్ రద్దు అయినందున ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు

## తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గుమ్మనూరు హంపయ్య కూతురు నిశ్చితార్థం

### ముఖ్య అతిథులుగా వైకుంఠం జ్యోతి



**చిప్పగిరి, జూలై, 12,( రిపబ్లిక్ న్యూస్)**
చిప్పగిరి మండలం గుమ్మనూరు గ్రామ సీనియర్ నాయకుడు హంపయ్య, కుమార్తె నిశ్చితార్థం ఆదివారం ఘనంగా జరిగింది, ఈ కార్యక్రమానికి ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు, పార్టీ నాయకులు కార్యకర్తలు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు, అనంతరం నూతన



వధూవరులను ఆశీర్వదించారు, గుమ్మనూరు హంపయ్య కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు, ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మీనాక్షి నాయుడు, సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, మండల కన్వీనర్ కొండా పురుషోత్తం, బెల్దోనా వెంకటేశ్వర్లు, జనార్దన్ స్వామి, బోగేస్ స్వామి, బంటనహాళ్ సురేష్, ఏరూరు నరసింహులు, కాలువ ప్రెసిడెంట్ దానప్ప, నంచర్ల తిమ్మప్ప, ఆలూరు తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

# మధుర గానానికి వీడ్కోలు

### ప్రభుత్వ లాంఛనాలతో ఎస్. జానకి అంత్యక్రియలు -అంతిమయాత్రలో కన్నీరుమున్నీరైన అభిమానులు

**అనంతపురం/మైసూరు క్రైమ్, జూలై 12,(రిపబ్లిక్ న్యూస్):**
భారతీయ సినీ సంగీత ప్రపంచాన్ని తన మధుర స్వరంతో ఆరు దశాబ్దాల పాటు అలరించిన గానకోకిల ఎస్. జానకికి ఆదివారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మైసూరు సమీపంలోని ఆమె ఫామ్‌హౌస్‌లో కుటుంబ సభ్యులు, బంధువులు, సినీ ప్రముఖులు, అభిమానుల సమక్షంలో అంత్యక్రియలు జరిగాయి. చివరిసారి తమ అభిమాన గాయనిని చూసేందుకు వేలాదిగా అభిమానులు తరలివచ్చి భావోద్వేగానికి గురయ్యారు.అంతకుముందు ఆమె పార్థివదేహాన్ని మైసూరులోని మహారాజా కళాశాల మైదానంలో ప్రజల సందర్శనార్థం సాయంత్రం వరకు ఉంచారు. సినీ, రాజకీయ, సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖులు నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో పార్థివదేహాన్ని ఫామ్‌హౌస్‌కు తరలించి ప్రభుత్వ గౌరవాలతో అంత్యక్రియలు నిర్వహించారు.
శనివారం అర్ధరాత్రి ఎస్. జానకి కన్నుమూయడంతో భారతీయ సినీ సంగీత ప్రపంచం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. గత కొంతకాలంగా వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె ఇటీవల తన కుమారుడి మరణంతో తీవ్ర మనోవేదనకు గురయిన ఆమె తీవ్ర ఒత్తిడికి గురై చివరికి తుది శ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని



గుంటూరు జిల్లాలో జన్మించిన ఎస్. జానకి చిన్ననాటి నుంచే సంగీతంపై ఆసక్తి పెంచుకుని శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందారు. ఆమె ప్రతిభను గుర్తించిన సంగీత దర్శకులు సినీ రంగంలో అవకాశం కల్పించారు. 1950ల చివర్లో సినీ గానరంగంలో అడుగుపెట్టిన ఆమె, అనంతరం ఆరు దశాబ్దాల పాటు తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో వేలాది పాటలు ఆలపించి అరుదైన రికార్డులు సృష్టించారు.కె.వి. మహదేవన్, ఎం.ఎస్. విశ్వనాథన్, చక్రవర్తి,



ఇళయరాజా, ఎం.ఎం. కీరవాణి తదితర ప్రముఖ సంగీత దర్శకుల స్వరాల్లో ఆమె ఆలపించిన ఎన్నో గీతాలు నేటికీ సంగీతాభిమానులను అలరిస్తూనే ఉన్నాయి. మధురమైన గానంతో కోట్లాది హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ఎస్. జానకి మరణం భారతీయ సినీ సంగీతానికి తీరని లోటు. ఎస్పీ బాలసుబ్రమణ్యం తో ఎస్ జానకి పాడిన వేలాది పాటలు సినీ చరిత్రలో ఓ మైలురాళ్లుగా నిలిచాయి.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com